Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

సోమవారం
30 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 143
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar



## మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది
- అందరినీ కాపాడుకునే బాధ్యత తమ ప్రభుత్వానిది
- హైదరాబాద్‌ను వరల్డ్ బెస్ట్ సిటీగా మారుస్తాం
- మంత్రి శ్రీధర్ బాబు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పేదల సొంతింటి కల నెరవేర్చుతామని అన్నారు. సొంతిల్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇవాళ(ఆదివారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదవారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు మాటిచ్చారు. అందరినీ కాపాడుకునే బాధ్యత తమ ప్రభుత్వానిదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌ను వరల్డ్ బెస్ట్ సిటీగా - మిగతా3లో

# మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం



- కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్..
- నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నజర్
- ఓటరు నమోదుపై వివిధ పార్టీల దృష్టి
- అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాల్సిందే
- 30 నుంచే ఓటరు నమోదుకు అవకాశం

**శుభ తెలంగాణహైదరాబాద్**

తెలంగాణలో మరో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆయా చోట్ల ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఆయా స్థానాల్లో ఎన్నికల కోసం ఈనెల 30 నుంచి ఓటరు నమోదు ప్రారంభంకానున్నది. ఆయా స్థానాల నుంచి ప్రస్తుతం టీ జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. దీని కోసం డిసెంబర్ నెలాఖరు కల్లా ఓటరు జాబితాను ప్రకటించడానికి ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఓటరు నమోదుకు నవంబర్ 1 కట్ ఆఫ్ తేదీగా నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తిరిగి ఓటరుగా - మిగతా3లో



## అలా చేసుంటే.. పాక్‌కు పెద్ద ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేవాళ్లం

- "మనం మిత్రులను మార్చగలం కానీ పొరుగువారిని మార్చలేం
- జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు ఇస్తుంటే, పాకిస్థాన్ మాత్రం చాలాకాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోంది
- సొంతగడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీని నడిపేందుకు ఇతర దేశాల నుంచి పాకిస్థాన్ డబ్బులు కోరుతోంది
- "టెర్రరిజంపై ఎప్పుడు విచారణ జరిపినా అందులో పాక్ ప్రమేయం కనబడుతూనే ఉంది

## మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

వారు బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది

'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి




**శుభ తెలంగాణ హైదరాబాద్**

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను - మిగతా3లో



## వరద సాయం పట్టని కేంద్రం

- ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ
- "కేంద్రం చేసిందేమీ లేదు
- ఉత్తర బెంగాల్ మొత్తం జలదిగ్బంధంలో ఉంది
- ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చాలా పెద్ద పెద్ద హామీలే ఇస్తారు, ఆ తర్వాత కనిపించరు



## నేపాల్‌లో వరదలు.. 112 మంది మృతి

- మరో 68 మంది గల్లంతయ్యారని అధికారుల వెల్లడి
- 54 ఏళ్ల తర్వాత రికార్డు వర్షపాతం నమోదు
- ఖాట్మండులో ఉప్పొంగుతున్న నదులు, ఇళ్లలోకి వరద

# బామ్మర్దికేమో అమృతం..! పేదలకు విషమా..!!



- రేవంత్ రెడ్డీ చూడు.. నీ ధన దాహం ఎంత పని చేస్తోందో
- రేవంత్ రెడ్డి రూ.1.50లక్షల కోట్ల ధన దాహానికి లక్షల మంది ప్రజలు నిరాశ్రయులు కాబోతున్నారు
- పేదల బతుకులతో ముఖ్యమంత్రి చెలగాటం ఆడుతున్నారు
- ప్రభుత్వం కూల్చివేతలు తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- కూల్చివేతలతో ప్రజల గుండెలు పగిలిపోతున్నాయి.
- బామ్మర్దితో లీగల్ నోటీసు పంపితే.. నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడడం బంద్ చేస్తా అనుకుంటున్నావా..?

**శుభ తెలంగాణ హైదరాబాద్**

మూసీ పరివాహక ప్రాంత ప్రజల్ని తెలంగాణ సర్కార్ తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రూ.1.50లక్షల కోట్ల ధన దాహానికి లక్షల మంది ప్రజలు నిరాశ్రయులు కాబోతున్నారని ఆయన మండిపడ్డారు. పేదల బతుకులతో ముఖ్యమంత్రి చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం కూల్చువేతలు తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇళ్లు కళ్లెదుటే కూల్చివేస్తుంటే ఆ బాధ ఎలా ఉంటుందో తెలుసా రేవంత్ రెడ్డి? అంటూ ప్రశ్నించారు. ట్విటర్ వేదికగా తెలంగాణ సర్కార్, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1.50లక్షల కోట్ల ధన దాహానికి ఒకటా రెండా హైదరాబాద్ నగరంలోని లక్షల మంది జీవితాలు చెల్లాచెదురవుతున్నాయి. నగరం రోదిస్తోంది. కూల్చివేతలతో ప్రజల గుండెలు పగిలిపోతున్నాయి. వారి ఇళ్లు చెదిరిపోతున్నాయి. ఆడబిడ్డల ఆవేదనలు, ఇంటి పెద్దల శాపనార్థాలతో నగరం రోదిస్తోంది. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న కుటీరాలను కన్నబిడ్డలకు ఇవ్వలేకపోతున్నామని తల్లిదండ్రులు - మిగతా3లో

శుభ తెలంగాణ
సోమవారం | మేడ్చల్
30 సెప్టెంబర్ 2024
www.subhatelangana.in


# ప్రభుత్వ పరిహారం.. బ్యాంకుల పాలు



**విజయవాడ :** బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల్ని ఆదుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటిస్తే అది కాస్త బ్యాంకుల పాలవుతోంది. గత రెండ్రోజులుగా ఏపీ ప్రభుత్వం ఆధార్ కార్డుతో లింకైన బ్యాంకు ఖాతాలకు పరిహారాన్ని చెల్లిస్తోంది. ఈ క్రమంలో కొందరు వరద బాధితుల పరిహారాన్ని బ్యాంకులు తమ పాత బాకీల్లో జమ చేసుకుంటున్నాయి. మైనస్ అకౌంట్లలోఉన్న నగదును బ్యాంకులు మళ్లించుకుంటుండంతో బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. వరద బాధితుల నష్టం గణించినపుడు ఇచ్చిన బ్యాంకు అకౌంట్ ఒకటైతే ఆ ఇంట్లో ఎవరి అకౌంట్లో మైనస్ ఖాతా ఉంటే ఆ ఖాతాలకు నగదు బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంట్లో బాధితులు లబోదిబోమంటున్నారు. కుటుంబంలో డిబిటి మ్యాపింగ్ ఉన్న ఖాతాలకు పరిహారం జమ చేస్తున్నట్టు బ్యాంకులు చెబుతున్నాయి. కొందరికి ఇనాక్టివ్ ఖాతాలు, ఆధార్ కేవైసీ కానీ ఖాతాలకు కూడా పరిహారం జమైన ఉదంతాలు వెలుగు చూశాయి. బుడమేరు వరదల్లో ముంపుకు గురైన బాధితులకు పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. ఈ క్రమంలో పలు జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఈ మొత్తాన్ని పాతబకాయిలు, మైనస్ అకౌంట్లలో జమ చేసుకుంటున్నాయి. బుధవారం నుంచి నగదు చెల్లింపులు మొదలు కావడంతో లబ్దిదారులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ఆ ఖాతాల్లో నగదు పడినా వెంటనే బ్యాంకులకు ఆటోమెటిక్ డెబిట్ కావడంతో తామేమి చేయలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.సర్వం కోల్పోయిన బాధితులకు పరిహారం అందకుండా బ్యాంకులు చేయడంపై బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నగదు రాకపోవడంతో బ్యాంకుల వద్ద బాధితులు ఉసురుమంటూ వెనుదిరుగుతున్నారు.ఆధార్ బేస్డ్ పేమెంట్స్ పద్ధతిలో ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. పరిహారం నగదు విషయంలో బ్యాంకులకు సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఈ సమస్యలు తలెత్తాయి. కెనరా బ్యాంకు ఖాతాదారులకు ఈ సమస్యలు ఎక్కువగా ఎదురైనట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.బుడమేరు వరద బాధితులకు పరిహారం చెల్లింపు కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి దాదాపు 536.28కోట్ల రూపాయల పరిహారాన్ని ముంపు బాధితుల ఖాతాలకు ఆధార్ బేస్డ్ చెల్లింపుల ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో చేపట్టారు. గురువారం సాయంత్రానికి మొత్తం 3,71, 302మందికి పరిహారం చెల్లింపుకు ఏర్పాట్లు చేసినట్టు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా హిందుస్తాన్ టైమ్స్‌కు తెలిపారు.మరో రూ.10.69కోట్ల రుపాయల చెల్లింపులు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయన్నారు. 16668మంది బాధితులకు టెక్నికల్ ఇష్యూస్ వల్ల పరిహారం చెల్లింపు జరక బ్యాంకు ఖాతాలకు తిరిగి వచ్చాయని వివరించారు. మొత్తం 3,54,634మంది బాధితులకు రూ. 525.59కోట్ల రుపాయల్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. మిగిలిన వారికి కూడా చెల్లింపులు కొనసాగుతాయని వివరించారు. నగరంలోని వివిధ దశల్లో చేపట్టిన వరద నష్టం గణనలో పలు కుటుంబాలు తమకు పరిహారం అవసరం లేదని పేర్కొన్నాయి. ఇలాంటి కుటుంబాలు దాదాపు 80వేల వరకు ఉండొచ్చని సిఎంఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. వరదల్లో ప్రధానంగా ఒక అంతస్తులోపు మాత్రమే నివాసాలు ఉన్న వారికి ఎక్కువ నష్టం వాటిల్లింది. రెండో అంతస్తు ఉన్న వారికి వరద ముంపుకు గురి కాలేదు. మొదటి అంతస్తులోపు ఉన్న వారికి రూ.25వేలు, మొదటి అంతస్తు ఆపై ఉన్న వారికి రూ.10వేల పరిహారం ప్రభుత్వం ప్రకటించింది. ద్విచక్ర వాహనానికి రూ.3వేలు, ఆటోకు రూ.10వేలు చెల్లించారు. దుకాణాలు, పశువులు, కోళ్లు ఇలా అన్నింటికి లెక్క కట్టి పరిహారం చెల్లించారు. వరద నష్టం గణనలో పలు కుటుంబాలు తమకు ఎలాంటి నష్టం జరగలేదని, పరిహారం అవసరం లేదని పేర్కొనడాన్ని అధికారులు గుర్తించారు. ఇలాంటి కుటుంబాలు 80వేల వరకు ఉండొచ్చని, వరద నష్టం చెల్లింపు పూర్తైన తర్వాత పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.

**రుణాలు కింద జమవద్దు : కలెక్టర్**

లబ్ధిదారులు బ్యాంకుల నుంచి ఇప్పటికే ఏవిధమైన రుణాలునైనా తీసుకొని ఉంటే జమచేసిన ఆర్థిక సహాయాన్ని రుణం కింద జమచేసుకోవద్దని సూచించారు. సర్వం కోల్పోయి ఎన్నో ఆర్థిక మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ విషయంలో బ్యాంకుల భాగస్వామ్యం అవసరమన్నారు. జమచేసిన సొమ్ము ఆటోమేటిక్‌గా రుణ తిరిగి చెల్లింపు కింద కట్ అయినట్లు గుర్తిస్తే ఆయా బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు సమాచారమందించాలన్నారు. తిరిగి వారికి నగదు రూపంలో ఆర్థిక సహకారాన్ని అందించి వారు ఇబ్బందుల నుంచి బయటపడేయడంలో సహకరించాలని కలెక్టర్ సృజన బ్యాంకు అధికారులకు సూచించారు. దీనిపై కలెక్టర్ సూచనలను పరిగణనలోకి తీసుకొని తప్పనిసరిగా ఆర్థిక సహాయం బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటామని బ్యాంకర్లు చెప్పారు. లబ్ధిదారులకు సహకరించడంలో బ్యాంకర్లు ముందుంటామని తెలిపారు

## వరద సాయం పట్టని కేంద్రం



**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌ను వరదలు ముంచెత్తుతుండటంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. వరద సాయం అందించడంలో కేంద్రం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందంటూ తప్పుపట్టారు. తీవ్ర వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఉత్తర బెంగాల్‌లో ఆదివారం పర్యటించేందుకు బయలు దేరుతూ మీడియాతో మమతా బెనర్జీ మాట్లాడారు. 'కేంద్రం చేసిందేమీ లేదు, ఉత్తర బెంగాల్ మొత్తం జలదిగ్బంధంలో ఉంది. పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు అక్కడకు వెళ్తున్నాను. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ చాలా పెద్ద పెద్ద హామీలే ఇస్తారు, ఆ తర్వాత కనిపించరు. '' అంటూ కేంద్రంపై సీఎం మండిపడ్డారు. నేపాల్ నుంచి విడుదలైన 5 లక్షల క్యూసెక్కుల కోసీ నదీ జలాలతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు జలవిలయంలో చిక్కుకున్నాయని ఆరోపించారు. కూచ్ బెహర్, జల్పాయిగురి తదితర జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయని చెప్పారు. దక్షిణ బెంగాల్‌లోని ఏడు జిల్లాల్లో తాను పర్యటించానని, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ డ్యామ్‌ల వద్ద డ్రెడ్జింగ్ చేయడంలో కేంద్రం విఫలం కావడంతో బెంగాల్‌లోని పలు జిల్లాలు వరదల్లో చిక్కుకున్నాయని ఆరోపించారు. దీనికి డీవీసీనే బాధ్యత వహించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని, రాష్ట్ర యంత్రాంగం సహాయక కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొంటోందని చెప్పారు. చీఫ్ సెక్రటరీని నార్త్ బెంగాల్‌కు పంపామని, అక్కడి ప్రజలందర్నీ శనివారం రాత్రి సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. తాను కూడా అక్కడకు చేరుకుని అధికారులతో సమీక్ష జరిగిన తర్వాత మరింత సమాచారాన్ని తెలియజేస్తానన్నారు.

## నేపాల్‌లో వరదలు.. 112 మంది మృతి

భారీ వర్షాలతో నేపాల్ వణికిపోతోంది.. నదులు ఉప్పొంగి గ్రామాలు, పట్టణాలను ముంచేశాయి. దేశ రాజధాని ఖాట్మండులో పలు కాలనీలు జలమయంగా మారాయి. వరదలు ముంచెత్తడం, కొండచరియలు విరిగిపడడంతో 24 గంటల వ్యవధిలోనే 112 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో వంద మందికి పైగా గాయపడగా.. 68 మంది గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే నేపాల్ లో రికార్డు వర్షపాతం నమోదైంది. గడిచిన 54 ఏళ్లలో ఎన్నడూ కురవనంత వర్షం ఒక్కరోజే కురిసిందని అధికారులు చెప్పారు. ఏకంగా 323 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. వర్షాలు, వరదలకు దేశవ్యాప్తంగా 4.12 లక్షల ఇళ్లు ప్రభావితం అయ్యాయని వివరించారు. ఖాట్మండు చుట్టుపక్కల ప్రాంతాల్లోని నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. వరదలకు పలు ఇళ్లు కూలిపోగా రహదారులు కొట్టుకుపోయాయని చెప్పారు. వీటికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## 8 మంది రెబల్స్‌పై బీజేపీ వేటు




**ఛండీగఢ్:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో రెబల్స్ బెడద బీజేపీకి సైతం తప్పలేదు. ఎనిమిది మంది తిరుగుబాటు నేతలను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు బీజేపీ ఆదివారంనాడు ప్రకటించింది. వీరిలో ఇద్దరు మాజీ మంత్రులు కూడా ఉన్నారు. అక్టోబర్ 5న జరుగనున్న ఎన్నికల్లో వీరంతా స్వంతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగడంతో పార్టీ ఈ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఆరేళ్ల పాటు వీరిని పార్టీ నుంచి బరిష్కరిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మోహన్ లాల్ బదోలి ప్రకటించారు. తక్షణం ఆ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. పార్టీ బహిష్కరణ వేటుపడిన మాజీ మంత్రుల్లో రంజిత్ చౌతాలా, సందీప్ గార్గ్ ఉన్నారు. తనకు టిక్కెట్ నిరాకరించడంతో రంజిత్ చౌతాలా పార్టీని విడిచిపెట్టగా, ముఖ్యమంత్రి నయబ్ సింగ్ సైనిపై సందీప్ గార్గే పోటీకి దిగడంతో ఆయనపై వేటుపడింది. తక్కిన వారిలో అస్సాంధ్ సీటులో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన రామ్ శర్మ, గనౌర్ నుంచి పోటీలో ఉన్న దేవేందర్ కద్యాన్, సఫిడో నుంచి బరిలో ఉన్న మాజీ మంత్రి బచన్ సింగ్ ఆర్య, మెహం నుంచి పోటీ చేస్తున్న రాధా అహ్లావత్, గురుగావ్ నుంచి పోటీ పడుతున్న నవీన్ గోయెల్, హథిన్ నుంచి పోటీలో ఉన్న కెహర్ సింగ్ రావత్ ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 1న జరగాల్సిన హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వివిధ పార్టీల విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 5వ తేదీకి ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. హర్యానాతో పాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న ప్రకటిస్తారు.

## 'కుంభమేళాలో భారీగా గంజాయి సేవిస్తారు'.. గంజాయిని చట్టబద్ధం చేయాలన్న ఎంపీపై కేసు



లక్నో: ఒక ఎంపీ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. కుంభమేళాలో భారీగా గంజాయి సేవిస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో గంజాయిని చట్టబద్ధం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆ ఎంపీపై కేసు నమోదైంది. (%ఝుంవ ాూస్త్రుఱఅర్ ూా ఫ్రీ%) ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ)కి చెందిన ఘాజీపూర్ ఎంపీ అఫ్జల్ అన్సారీ ఇటీవల మీడియాతో మాట్లాడారు. కుంభమేళాలో పెద్ద మొత్తంలో గంజాయి సేవిస్తారని తెలిపారు. గంజాయితో నిండిన గూడ్స్ రైలు మొత్తం కూడా కుంభమేళాకు సరిపోదని ఎద్దేవా చేశారు. మతపరమైన కార్యక్రమాలు, పండుగల సమయాల్లో గంజాయిని 'ప్రసాదం'గాను వినియోగిస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో గంజాయిని చట్టబద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, ఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీ వ్యాఖ్యలపై సాధువులు, హిందూ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో ఘాజీపూర్ పోలీసులు స్పందించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని సంబంధిత సెక్షన్ల కింద ఎస్పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై కేసు నమోదు చేశారు.

## కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ రాజీనామా చేయాలి : కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ డిమాండ్



ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. బాండ్ల పేరుతో స్కామ్ జరిగిందన్న ఆరోపణలపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై కేసు నమోదైంది. ఈ క్రమంలో అధికార పార్టీపై కాంగ్రెస్ మరోసారి విరుచుకుపడింది. ప్రజాస్వామ్యాన్ని నిర్వీరం చేసినందుకు ఆర్థిక మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ద్వారా మొత్తం ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌పై విచారణ జరిపించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా డబ్బు వసూలు చేసేందుకు నాలుగు పద్ధతులను బీజేపీ ఉపయోగిస్తోందని కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వీ ఆరోపించారు. గతేడాది కాలంలో మీడియా ఎలక్టోరల్ బాండ్లపై అనేక కథనాలు, పేర్లను ప్రచురించాయని తెలిపారు. చాలా కేసుల్లో మొదటి దర్యాప్తు సంస్థలు కంపెనీలపై దాడులు చేశాయని.. ఆ తర్వాత ఆయా కంపెనీలు చాలా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేశాయన్నారు. బాండ్ల కొనుగోలు తర్వాత కేసుల దర్యాప్తు వేగం మందగించినట్లు కనిపించిందని ఆరోపించారు. రూ.100కోట్ల మూలధనం లేని కంపెనీలు రూ.500 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేయడం చూశామన్నారు. ఎలక్టోరల్ బాండ్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే నాలుగో అంశం సింఘ్వీ అన్నారు. ఏదైనా కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే నిబంధన ఉందని.. కేసు ప్రాథమిక దర్యాప్తు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఇదిలా ఉండగా.. శనివారం బెంగళూరు కోర్టు ఆదేశాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల విషయంలో నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురిపై కేసు నమోదైంది. ఈడీ అధికారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి బీజేపీ నేతల పేర్లు సైతం ఉన్నారు. ఈ 384, 120బీ, 34 కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో కర్ణాటక బీజేపీ చీఫ్ బీవై విజయేంద్ర, ఆ పార్టీ నేత నళిన్ కుమార్ కటీల్ పేర్లు ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో దోపిడీకి పాల్పడ్డారని, రూ.8వేలకోట్లకు పైగా వసూలు చేశారని జనాధికార సంఘర్ష్ పరిషత్ కో చైర్మన్ ఆదర్శ్ ఆర్ అయ్యర్ ఫిర్యాదు చేశారు. ఈడీ అధికారుల మద్దతుతోనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రయోజనాల కోసం వేలకోట్లు దోపిడీ చేసినట్లు ఆయన ఆరోపించారు.

## అలా చేసుంటే.. పాక్‌కు పెద్ద ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేవాళ్లం



**శ్రీనగర్:** పాకిస్థాన్‌పై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యూఢిల్లీతో పాక్ సత్సంబంధాలు కొనసాగించి ఉంటే బెయిల్‌అవుట్ ప్యాకేజీ కింద అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఇస్లామాబాద్ కోరినదాని కంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీని ఇండియా ఇచ్చి ఉండేదని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బండిపోర జిల్లాలోని గురేజ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మనం మిత్రులను మార్చగలం కానీ పొరుగువారిని మార్చలేం" అని మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రాజ్‌నాథ్ ప్రస్తావిస్తూ, పాక్ సరైన సంబంధాలు కొనసాగించి ఉంటే ఐఎంఎఫ్ కంటే మనమే ఎక్కువ మొత్తంలో ప్యాకేజీ ఇచ్చి ఉండేవాళ్లమని అన్నారు. జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు ఉస్తుంటే, పాకిస్థాన్ మాత్రం చాలాకాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. సొంతగడ్డపై ఉగ్రవాద ఫ్యాక్టరీని నడిపేందుకు ఇతర దేశాల నుంచి పాకిస్థాన్ డబ్బులు కోరుతోందన్నారు.

"టెర్రరిజంపై ఎప్పుడు విచారణ జరిపినా అందులో పాక్ ప్రమేయం కనబడుతూనే ఉంది. ఉగ్ర శిబిరాలను ఆపేయాలని అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పాక్‌కు చెప్పిచూసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. 370వ అధికరణ రద్దుతో ఆశాభంగం కలిగిన పాక్ ఉగ్రవాదాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు సాగిస్తోంది. ఇక్కడ ప్రజాస్వామ్యం వెళ్లూనుకోవడం ఆ దేశానికి ఇష్టం లేదు. కానీ సొంతగడ్డపైనే పాక్‌కు గుణపాఠం చెప్పగలిగే సత్తా ఇండియాకు ఉంది. పాకిస్థాన్‌లోని ఎవరైనా ఇండియాపై దాడికి తలబడితే సరిహద్దులు దాటి మరీ స్పందిస్తా" అని రాజ్‌నాథ్ తెలిపారు. అటల్ బిహారీ వాజ్‌పేయి చెప్పినట్టు "మానవత్వం, ప్రజాస్వామ్యం, కశ్మీర్ ప్రజల గుర్తింపు"ను సాధించగలిగితే కశ్మీర్ తిరిగి భూతల స్వర్గం అవుతుందని అన్నారు.

## కొత్త పార్టీ నాయకుడెవరనే దానిపై ప్రశాంత్ కిషోర్ ట్విస్ట్




**పాట్నా:** జన్ సురాజ్ నేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. కొత్త పార్టీ పేరు, నాయకత్వం తదితర వివరాలను అక్టోబర్ 2వ తేదీన ప్రకటిస్తామని తెలిపారు. 2022 అక్టోబర్ 2న 'జన్ సురాజ్' పేరుతో ఆయన ప్రారంభించిన యాత్ర రెండేళ్ల పూర్తి చేసుకోనున్న సందర్భంగా పాట్నాలో ఆదివారంనాడు జరిగిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు నాయకత్వ బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధం కావాలని సూచించారు.

**నాయకుడిని కావాలని ఎన్నడూ అనుకోలేదు...**

కొత్త పార్టీకి తాను నాయకుడిని కాదని, అలా ఉండాలని తాను ఎన్నడూ అనుకోలేదని ప్రశాంత్ కిషోర్ మరో ట్విస్ట్ ఇచ్చారు. ప్రజలే నాయకత్వ బాధ్యతలు స్వీకరించడానికి ఇదే సరైన తరుణమని అన్నారు. 2022 మే 5న జన్ సురాజ్ జర్నీ మొదలవుతోందని తాను ప్రకటించానని, మూడు ప్రధాన ఉద్దేశాలతో జన్ సురాజ్ యాత్ర చేపట్టడం, దాని గురించి చర్చించడం జరిగిందని అన్నారు. 2.5 ఏళ్ల పాటు సాగిన ప్రయాణం అక్టోబర్ 2వ తేదీన కీలక మైలురాయికి చేరుకోనుందన్నారు. ఇంతవరకూ సాగించిన ప్రయత్నాల ఫలితంగా జన్ సురాజ్ అక్టోబర్ 2న కొత్త రాజకీయ పార్టీగా అవతరించనుందని తెలిపారు.

**3 ప్రధాన లక్ష్యాలివే..**

జన్ సురాజ్ యాత్రను తాను 3 ప్రధాన లక్ష్యాలతో చేపట్టి ప్రజల వద్దకు తీసుకువెళ్లినట్టు ప్రశాంత్ కిషోర్ చెప్పారు. రాష్ట్ర ప్రజలు, వారి చిన్నారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవడం మొదటిదని, ఇందుకోసం గ్రామగ్రామానికి వెళ్లి వారిని చైతన్యవంతులను చేశామని చెప్పారు. తప్పుదారి పట్టించే నేతలకు ఓటు వేయరాదని ప్రజల్లో అవగాహన కల్పించడం రెండో ఉద్దేశమన్నారు. బీహార్ ప్రగతికి పనిచేయడం మూడో ఉద్దేశమని చెప్పారు. విద్య, వ్యవసాయం, ఉద్యోగితపై దృష్టి పెట్టి 8,500 పంచాయితీల అభివృద్ధికి వ్యూహాలను రూపొందించడం ద్వారా టాప్-10 రాష్ట్రాల్లో బీహార్ నిలిచేలా చేయాలనేది తమ ఉద్దేశమని చెప్పారు. ఈ మూడు ఉద్దేశాలతో 2022 అక్టోబర్ 2న వెస్ట్ చంపరాన్‌లోని గాంధీ ఆశ్రమం నుంచి తమ యాత్ర ప్రారంభించామని, ఇందుకోసం ఇన్ని కిలోమీటర్లు తిరగాలని కానీ, ఇన్ని రోజులు పర్యటించాలని కానీ తాను అనుకోలేదని చెప్పారు. తమ లక్ష్య సాధనలో భాగంగా బీహార్‌లోని 60 శాతం ప్రాంతాల్లో పర్యటించామని, తదుపరి యాత్ర కూడా కొనసాగుతుందని తెలిపారు.

## 1908లో నిజాం రాజు ఇండ్లు కూలగొట్టలే..

# కానీ రేవంత్ కూలగొడుతున్నడు

**హైదరాబాద్ :** మూసీ, హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ తన పోరాటాన్ని వేగవంతం చేసింది. హైదర్‌షాకోట్‌లో మూసీ బాధితుల ఇండ్లను పార్టీ నేతలు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్‌తో పాటు పలువురు నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా మూసీ బాధితులకు బీఆర్ఎస్ నేతలు ధైర్యం చెప్పారు. మీకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాధితులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 1908లో వరదలొచ్చిన నిజాం రాజు ఇండ్లు కూలగొట్టలే.. కానీ రేవంత్ నిజాం కంటే దారుణంగా వ్యవహరిస్తున్నాడు. బలిసినోళ్లకు ఒక న్యాయం.. పేదోడికి ఒక న్యాయమా..? మీకు ఇబ్బంది వస్తే.. తెలంగాణ భవన్‌కు రండి.. 24 గంటలు తలుపులు తెరిచే ఉంటాయని హరీశ్‌రావు స్పష్టం చేశారు. అర్ధరాత్రి వచ్చినా.. మీకు ఆశ్రయమిస్తామని బాధితులకు హరీశ్‌రావు భరోసానిచ్చారు. అత్యవసరమైతే ఫోన్ చేయండి.. పదిహేను నిమిషాల్లో మీ ముందుంటాం.. రేవంత్‌రెడ్డి బయటకొచ్చి బాధితులకు భరోసా ఇవ్వు.. మౌనం వీడి మూసీ సుందరీకరణ మానుకో. స్కూళ్లలో, హాస్టల్స్‌లో టాయిలెట్స్ లేక ఆడపిల్లలు ఇబ్బందులు పడుతుండ్రు. నీ దగ్గర పైసలు ఎక్కువుంటే ముందు వాటిని నిర్మించండని హరీశ్‌రావు సూచించారు. గాంధీ ఆస్పత్రిలో మందులు లేవు.. ముందు అవి కొని, పేదలకు మెరుగైన వైద్యం అందించండని రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు. రేవంత్.. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజల ఉసురు పోసుకోకు. మొద్దు నిద్ర పోతున్న రేవంత్ రెడ్డిని తట్టి లేపేందుకే మేమంతా మీ ముందుకొచ్చినం. ఆపదొస్తే ఫోన్ చేయండి.. అర్ధగంటలో మీ ముందుంటా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.




**మీ కన్నీళ్లు చూస్తుంటే.. రాతి గుండె కూడా కరిగిపోతుంది..**

మీ బాధ చూస్తుంటే.. నా కళ్లలో నీళ్లు వస్తున్నాయ్.. మీ బాధలు వింటుంటే.. మీ కన్నీళ్లు చూస్తుంటే.. రాతి గుండె కూడా కరిగిపోతుంది.. కానీ, రేవంత్ గుండె ఎందుకు కరుగతలేదో నాకు అర్థం కావాట్లేదు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మూసీ, హైడ్రా బాధితులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ నేతలు.. హైదర్‌షాకోట్‌లో బాధితుల ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ధైర్యంగా ఉండండి.. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దన్నారు. రేవంత్ ప్రభుత్వం.. మీ ఇండ్లు ముట్టుకోకుండా మేం అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. బుల్డోజర్లు వచ్చినా.. జేసీబీలు వచ్చినా.. ముందు మిమ్మల్ని దాటి రావాలి. హైడ్రా పుణ్యామా అని ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మీరు అధైర్య పడొద్దు.. ప్రాణాలు తీసుకొవద్దు.. మీ ఇండ్లకు ఏం కాకుండా మేము అడ్డుపడతామని హరీశ్‌రావు భరోసానిచ్చారు.

**కాంగ్రెస్ హస్తం గుర్తు తీసేసి.. బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి..**

1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే బాధితులందరికీ అనుమతులిచ్చిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి.. మీ తప్పిదాలకు పేదలకు ఎందుకు బలికావాలి..? ఇందిరమ్మ పాలన అంటే%ా% పేదలకు కూడు, గుడ్డ, నీడ ఇచ్చేది. కానీ మీ ఇందిరమ్మ పాలన పేదల బతుకులు కూల్చే ప్రయత్నం చేస్తున్నావ్. తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది. కాంగ్రెస్ హస్తం గుర్తు తీసేసి, బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి అని హరీశ్‌రావు సూచించారు.

**నువ్వు కూల గొట్టే పేదల ఇండ్లు జీవిత కాలం కళ..**

దేశాన్ని కాపాడటం కోసం సరిహద్దులో పోరాటం చేసిన సైనికులు.. ఇప్పుడు ఇండ్లు కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సి వస్తుంది. రేవంత్‌రెడ్డి.. నీ ప్రభుత్వ జీవిత కాలం ఐదేండ్లు మాత్రమే.. కానీ నువ్వు కూల గొట్టే పేదల ఇండ్లు జీవిత కాలం కళ. ముందు నువ్వు ఇచ్చిన హామీలు నెరవేర్చు.. వృద్ధులకు పింఛన్, రైతులకు రైతుబంధు, మహిళలకు 2500 ఇవ్వు, ఉద్యోగులకు డీఏ ఇవ్వు, దానికి లేని డబ్బులు మూసీ సుందరీకరణకు లక్షా యభై వేల కోట్లు ఎక్కడికెళ్లి వచ్చినయ్..? అని హరీశ్‌రావు నిలదీశారు.

**కేసీఆర్ అండగా ఉంటారు.. మీరంతా ధైర్యంగా ఉండండి..**

రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడుతామని హరీశ్‌రావు తెలిపారు. అవసరమైతే ఏరియాకు ఒక ఎమ్మెల్యే ఉండి మీ ఇండ్లు కాపాడుతాం.. మూసీని ఆక్రమించి ఆరు పెద్ద పెద్ద బిల్డింగ్‌లు కడుతుంటే ఎందుకు కూలగొట్టట్లే. బలిసినోళ్ల దగ్గరుండి కట్టిస్తున్నావ్.. పేదల ఇండ్లకు మాత్రం నోటీసులిస్తావా.. పేదలకు బీఆర్ఎస్ పార్టీ, అధినేత కేసీఆర్ అండగా ఉంటారు.. మీరంతా ధైర్యంగా ఉండండి అని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.

# బామ్మర్దికేమో అమృతం..! పేదలకు విషమా..!!

-మొదటిపేజీ తరువాయి

తల్లడిల్లిపోతున్నారు. అమ్మ లాంటి ఇల్లు వదిలి వేరే దిక్కు ఎలా పోతామంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చే ఇల్లు కూలుస్తారేమో అని ఆత్మహత్య చేసుకున్న తల్లి ఒకవైపు, భార్య కడుపుతో ఉన్నా కనికరించరా అంటూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భర్త మరోవైపు. బీఆర్ఎస్ హయాంలో రైతుల ప్రయోజనం కోసం 30వేల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే రిజర్వాయర్ నిర్మాణం విషయంలో రైతులను రెచ్చగొట్టి శవరాజకీయాలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎక్కడ ఉన్నావ్. ఆనాడు అలా చేసి నేడు నీ అవసరానికి ఎంత నీచానికైనా తెగిస్తావని మరోమారు నిరూపించావు. మహా నగర ప్రజలారా మీరు అధైర్య పడొద్దు. ఇప్పుడు జరుగుతున్న విధ్వంసంతో తొందరపడి ప్రాణాలు బలితీసుకోవద్దు. న్యాయస్థానాలు ఉన్నాయి. మీకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది” అని ట్వీట్ చేశారు.

మూసీ మార్కింగ్ నిలిపివేత..

మరోవైపు ఏళ్ల తరబడి ఉంటున్న తమను ఒక్కసారిగా వెళ్లమనడంపై మూసీ ప్రాంతం ప్రజలు అధికారులను నిలదీశారు. వాగ్వాదాలు, ఘర్షణలకు దిగుతుండడంతో మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపి వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్కింగ్ నిలిపివేశారు. మరోవైపు శనివారం నిర్వాసితులతో అధికారులు చర్చలు జరిపారు. మూసీ పక్కన ఇబ్బందులు పడే కంటే.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రశాంతంగా ఉండాలని స్థానికులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇంటి విలువ రూ.30లక్షలకు పైగానే ఉంటుందని చెప్పారు. వీటి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తామని, ఇందు కోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను పంపిస్తున్నట్లు అధికారులు వారికి వివరించారు.

సానుకూలత వ్యక్తం చేసినవారిని వెంటనే తరలించారు. కాగా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి హిమాయత్‌నగర్ మండలం వినాయక వీధి (రసూల్‌పూర), శంకర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడారు. 151కుటుంబాలను పిల్లి గుడిసెలు, జియాగూడకు తరలిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర మూసీ పరివాహకం ఉంది. నదీ గర్భంతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో 12,184 అక్రమ కట్టడాలున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 1,595, మేడ్చల్‌లో 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు నదీ గర్భంలో ఉన్నట్లు తేల్చారు. రెవెన్యూ అధికారులు గురు, శుక్రవారాల్లో హైదరాబాద్‌లో 1,485 నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. జియాగూడ, నాంపల్లిలో 110 నివాసాలకు మార్కింగ్ చేయాల్సి ఉంది. అయితే ఈ పనులను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

బామ్మర్దికేమో అమృతం..! పేదలకు విషమా..!!

తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డిని ఢిల్లీలో ఉన్న బీజేపీ కూడా కాపాడడం కష్టమే.. ఆయన రాజీనామా చేయక తప్పదని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. బామ్మర్దితో లీగల్ నోటీసు పంపితే.. నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడడం బంద్ చేస్తా అనుకుంటున్నావా..? అని కేటీఆర్ అడిగారు. బామ్మర్దికి అమృతం పంచి.. పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోమని తేల్చిచెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఆయన డిపార్ట్‌మెంట్‌లోనే ఆయన బామ్మర్ది శోద కంపెనీకి రూ. 1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది ముమ్మాటికీ నిజం. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్స్ 7, 11, 13ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉల్లంఘించిన మాట నిజం. శోద అనే కంపెనీ గత రెండు సంవత్సరాలుగా రెండు కోట్ల రూపాయాలు మాత్రమే లాభం ఆర్జించిన ఒక చిన్న కంపెనీ అని కేటీఆర్ గుర్తు చేశారు. ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడడం కష్టమే.. ఈ దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయితీగా ఉన్నది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్ లాగా, నువ్వు దొరికావు.. రాజీనామా తప్పదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఎవరికి వారే!

పార్టీని అక్కున చేర్చుకున్నారు. అటు కేసీఆర్ ఉద్వేగభరిత ప్రసంగాలతోపాటు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో అందరినీ ఆకట్టుకున్నారు. అలా ఉద్యమ సమయంలోనే ఆ పార్టీకి చెప్పుకోదగిన విధంగా స్థానాలను కట్టబెట్టారు. తరువాత తరువాత రాష్ట్రం సిద్ధించాక కూడా ఉద్యమ పార్టీని ప్రజలు ఎక్కడా వీడలేదు. ఉద్యమంలో ఎలా అయితే తోడుగా నిలిచారో.. ఆ తరువాత కూడా అంతే స్థాయిలో అక్కున చేర్చుకున్నారు. అలా మొదటి సారి రాష్ట్రంలో ఆ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారు. కేసీఆర్ ఆ విధంగా మొదటి సారి సీఎం అయ్యారు. రాజకీయ చాణక్యుడిగా పేరున్న కేసీఆర్.. అటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చూస్తూనే.. ఇటు ఉద్యమ పార్టీని కాస్త పక్కా రాజకీయ పార్టీగా మార్చేశారు. అయినప్పటికీ నేతలు, కార్యకర్తలు కట్టుబడి పార్టీ వెంటే ఉండిపోయారు. ఆ తరువాత మొదటి టర్మ్ ముగిసింది. రెండో టర్మ్‌లోనూ మరోసారి గులాబీ పార్టీ హవానే సాగింది. అలా రెండు పర్యాయాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఇక మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆయన దక్కిమొక్కీలు తిన్నారు. పదేళ్ల అధికార పీఠానికి బీటలు పడ్డాయి. ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక జగన్‌మోహన్ రెడ్డి విషయానికి వస్తే తన తండ్రి వైఎస్సార్ రాజకీయవారసత్వాన్ని అందిపుచ్చుకొని జగన్ రాజకీయాల్లో వచ్చారు. ఎంపీగా భారీ మెజార్టీతో విజయాలు సాధించారు. అనుకోకుండా తండ్రి వైఎస్సార్ మరణం పొందడంతో ఆయనకు పెద్ద పరీక్షలే ఎదురయ్యాయి. అయితే.. ముఖ్యమంత్రి ఆశించి ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఇవ్వలేదు. దాంతో పార్టీ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. కాంగ్రెస్‌తో కొట్లాడిన ఆయన చివరకు సంవత్సరంన్నర పాటు జైలు జీవితాన్ని గడపాల్సి వచ్చింది. ఇక జైలు నుంచి బయటకు వచ్చాక నిత్యం ప్రజల్లో ఉండిపోయారు. అప్పటికే రాష్ట్ర విభజన జరగడంతో మొదటి సారి ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు జగన్. కానీ.. ఎప్పటిలాగే ప్రజలు సీనియారిటీకి పట్టం కట్టారు. చంద్రబాబును సీఎం చేశారు. అలా.. ఐదేళ్లు గడిచాక చంద్రబాబు పాలనపై విసుగు చెందిన ప్రజలు ఆ తదుపరి ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేశారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన జగన్.. మొన్నటి ఎన్నికల్లో ఓటమి పాలు కావాల్సి వచ్చింది. వై నాట్ 175 అని అత్యాశతో ప్రచారంలోకి వెళ్లిన ఆయన చివరకు అధికారం కోల్పోవాల్సి వచ్చింది. ఇక్కడ కేసీఆర్, జగన్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. జగన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా కేసీఆర్ స్వయంగా ఏపీ రాష్ట్రానికి వెళ్లారు. అటు జగన్ కూడా చాలా సందర్భాల్లో కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఒకవిధంగా చెప్పాలంటే ఓ కుటుంబ సభ్యుల్లాగే వారు కలిసిమెలిసి ఉండేవారు. అయితే.. ఇద్దరు కూడా ఒకేసారి అధికారాన్ని కోల్పోవడం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. ఇప్పుడు ఇద్దరు కూడా అధికారం కోల్పోయి ఉన్నారు. ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ ఆసక్తికర అంశాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏపీకి వచ్చే సరికి లడ్డూ వివాదం రచ్చగా మారింది. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేశారంటూ టీడీపీ ప్రభుత్వం పెద్దలు వైఎస్సార్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ వ్యవహారంలో జగన్ చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారనే చెప్పాలి. నెయ్యిలో కల్తీ జరిగితే దాంతో తనకేం సంబంధం అని చెప్పాల్సిన జగన్.. లేదు లేదు నేను నేనే అంటూ నెత్తినేసుకుంటున్నారు. దాంతో ఇప్పుడు ఆయన ఆ వివాదం నుంచి బయటపడడం పెద్ద టాస్క్ అయింది. కల్తీ జరగలేదని మీడియా ముఖంగా చెబుతున్నప్పటికీ ఆయనకు ఆ స్థాయిలో మైలేజీ రావడం లేదనేది వాస్తవం. చంద్రబాబు రాజకీయ చతురత ముందు ఈయన పప్పులు ఉడకడం లేదు అనేది అక్కడ నడుస్తున్న టాక్. అయితే.. దాని నుంచి కొంతైనా కాపాడుకునేందుకు ఇప్పుడు తిరుమల దర్శనానికి వెళ్తున్నారు. ఆయన తిరుమలకు వెళ్లినంత మాత్రానా పడిన ముద్ర పోతుందా..? ల్యాబ్ రికార్డులు తారుమారు అవుతాయా..? అందుకే.. జగన్ రాజకీయ పాఠాలు ఇంకా నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిపుణులు అంటున్నారు. ఇప్పుడు ఆయన తిరుమలకు వస్తే అక్కడ ఖచ్చితంగా నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సో.. అది కాస్త ఆయనకు పెద్ద మైనసే అవుతుంది. గతంలో ఆయన రాజకీయాల కోసం ఎన్నడూ తిరుపతికి వెళ్లింది లేదు. కానీ.. ఈసారి తన నిజాయితీని నిరూపించుకోవాలనే ఉద్దేశంతో తిరుమలకు వెళ్తున్నా ఆ స్థాయిలో నిరసనలు తప్పితే మైలేజీ వస్తుందన్న గ్యారంటీ అయితే లేదు. తెలంగాణలో ఎప్పుడైతే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందో అప్పటి నుంచి కేసీఆర్ సైలెంట్ అయ్యారు. దాంతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతా తానై నడిపిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు భగ్గుమంటున్నారు. అయితే.. కేటీఆర్ రాజకీయాలు కూడా జగన్ వలే ఆలోచన లేకుండా ఉంటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ప్రతిపక్ష హోదాను ఎదుర్కోలేదు. మొదటిసారి అధికారం కోల్పోవడంతో ఆవేశంతో ఏదేదో మాట్లాడేస్తున్నారు. ప్రతిపక్షం అంటే ప్రభుత్వం చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని వ్యతిరేకించడమే అనే ధోరణిలో ఉన్నారు. ప్రజలు తన వ్యాఖ్యల్ని నమ్ముతారా లేదా అని కనీసం ఆలోచన చేయకుండా.. ఎంతసేపూ రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తున్నారు.

## మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం..

-మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు. రన్‌లో భాగంగా గిన్నిసబుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

నమోదు చేసుకోవాల్సిందే. గతంలో ఓటు ఉన్నా మరోసారి ఓటు నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. 2019లో ఆయా స్థానాలకు ఎన్నికలు జరగ్గా అప్పుడు తక్కువగా ఓట్లు నమోదయ్యాయి. 4 ఉమ్మడి జిల్లాల్లో కలిపి కేవలం 1.96 లక్షల మంది పట్టభద్రులే ఓటర్లు నమోదు చేసుకున్నారు. అదే ఏడాది కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 23 వేల మంది, నల్లగొండ టీచర్ నియోజకవర్గంలో 21 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

## ప్రాణం పోయినా ప్రజలకు అన్యాయం జరగనివ్వం : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

**సూర్యాపేట :** ప్రజల జీవితాలతో అడుకుంటామంటే చూస్తూ ఊరుకోం. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ తరహాలో సూర్యాపేట పట్టణంలో కూల్చివేతలు జరుగుతున్న నేపథ్యంలో బాధితులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అభివృద్ధి చేస్తే.. కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటే.. రేవంత్ రెడ్డి వారి జీవితాలతో అడుకుంటున్నాడని విమర్శించారు. కేసీఆర్ అభివృద్ధి, నిర్మాణాలు చేపడితే.. కాంగ్రెస్ కూల్చివేతలు చేపడుతున్నదని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరిచిన కాంగ్రెస్ పార్టీ వారి ఆగడాలను చూస్తుంటే ప్రజల్లో తిరుగుబాటు వచ్చేలా ఉందన్నారు. ప్రజలను కన్నీళ్లు పెట్టించడం సమాజానికి మంచిది కాదు. ప్రాణం పోయినా ప్రజలకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలన్నారు. లేదంటే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## మూసీ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

మారుస్తామని అన్నారు. పీపీపీ కింద మూసీ ప్రాజెక్ట్ చేపడతామని ప్రకటించారు. మూసీలోకి గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. మూసీపై లింక్ రోడ్లు నిర్మిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. మూసీ ప్రక్షాళనపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఏం చేసింది? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు మొసలికన్నీరు కారుస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు బీఆర్ఎస్ ఏం చేసింది అని శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. గతంలో తాము మల్లన్నసాగర్ దగ్గరకు వెళ్తే అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. పోలీసులతో తమను అరెస్టు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తాము బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నామా అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు. కొంతమంది అవకాశవాదులు కాంగ్రెస్ నేతలను రెచ్చగొట్టే పనిలో ఉన్నారని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. ఎఫ్‌టీఎల్ పరిధిని దాచిపెట్టి విక్రయాలు చేసిన బిల్డర్లపై చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు హెచ్చరించారు. మూసీని పరిరక్షించుకోవాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని.. అందుకోసం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

## తెలంగాణలో రెండురోజులు పిడుగుల వానలు..!

తెలంగాణలో రాబోయే రెండురోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది. సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుంచి గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉన్న ద్రోణి.. ప్రస్తుతం కొమొరిన్ ప్రాంతం నుంచి ఇంటీరియర్ తమిళనాడు మీదుగా రాయలసీమ వరకు విస్తరించి ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఆదివారం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వానలుపడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## ఆదాయంలో అనూహ్య మార్పు!

-మొదటిపేజీ తరువాయి

జూన్‌లో రూ.12,190కోట్లు, జులైలో రూ.9,965 కోట్లు ఖజానాకు చేరాయి. గత నెల జులైతో పోలిస్తే ఆగస్టులో ఆదాయం 30శాతానికి పైగా పెరిగింది.

**పన్ను ఆదాయం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 5నెలల్లో పన్ను ఆదాయం రూ.57,772 కోట్లు కాగా బడ్జెట్ అంచనాతో పోలిస్తే 35శాతానికి పైగా ఉంది. ఆగస్టు వరకు జీఎస్టీ ద్వారా రూ.20,500కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.6,390కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.13,487 కోట్లు సమకూరాయి. ఆబ్కారీ శాఖ నుంచి రూ.7,806కోట్లు, కేంద్ర పన్నుల నుంచి రూ.6,220 కోట్లు వచ్చాయి. ఇతర పన్నుల ద్వారా రూ.3,316 కోట్లు సమకూరగా పన్నేతర ఆదాయం రూ.1,449 కోట్లు వచ్చింది. రుణాలు..లోటు కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో ఇప్పటివరకు రూ.2,447 కోట్లు వచ్చాయి. బడ్జెట్లో అంచనా వేసిన రూ.21వేల కోట్లలో పోలిస్తే వచ్చిన మొత్తం 11శాతమే. బడ్జెట్ లో రూ.2,21,242 కోట్ల రెవెన్యూ అంచనా వేయగా 5నెలల్లో 28శాతం అంటే రూ.61,618కోట్లు ఖజానాకు జమ అయ్యాయి. 5నెలల్లో ప్రభుత్వం రూ.29,449 కోట్ల రుణాలు తీసుకోగా బడ్జెట్లో అంచనా వేసిన రూ.49,255 కోట్లతో పోలిస్తే ఇది 60శాతంగా ఉంది. ఆగస్టు నెలవరకు ప్రభుత్వం రూ.85,467కోట్లు ఖర్చు చేసింది. ఆగస్టు నెల ముగిసే వరకు రూ.15,521 కోట్ల రెవెన్యూ లోటు రూ.29,449 కోట్ల ఆర్థికలోటు రూ.18,952 కోట్లు ప్రాథమిక లోటుగా పేర్కొంది.

## హైదరాబాద్ మెట్రో రెండోదశ పనులకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్:** ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పనులకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తం 116.2 కి.మీ. పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండ్రోజుల కిందట ఆమోదం తెలిపారు. మరోవైపు మెట్రో రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తుది మెరుగులు దిద్దుతోంది. మ్మొత్తం రూ.32,237 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు మెట్రో రైలు ఎండీ ఎన్‌వీఎస్ఎస్ రెడ్డి తెలిపారు. ఈ దశలోనే కొత్తగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీకీ సైతం మెట్రో సేవలు అందుబాటులోకి రానున్నాయని ఆయన వెల్లడించారు.

# చరిత్ర సృష్టించి వెళ్లిన మహాజన యోధుని కి సంస్మరణం

**పిపి వెంకటయ్య సార్ కు నివాళులర్పించిన మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు ఆనంద్**

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తొలితరం ఒక బహుజన బిడ్డ, రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముదిరేశి వెంకటయ్య అనే ఒక యోధుడు లేడనే విషయం సంవత్సరం గడిచిన నమ్మశక్యం లేని మహనీయులు... శివమ్మ రామయ్య దంపతులకు జన్మించిన మొదటి సంతానమే వెంకటయ్య సార్.

ఎందుకు యోధుడని సంబోధిస్తున్నామంటే?

కులరక్కసి కరాల నృత్యం చేసే రోజుల్లోనే ఒక మారుమూల గ్రామమైన లింగాయపల్లి, గండేడ్ మండలం, పరిగి తాలూకా లోని వెనుకబడిన తరగతి కుటుంబంలో జన్మించి విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు నిండుగా, మెండుగా పొందిపుచ్చుకొని ఒక వెలుగు వెలిగి 1982లోనే ఆనాటి భారతీయ జనతా పార్టీ అఖిలభారత అధ్యక్షులు మాన్యశ్రీ అటల్ బిహారి వాజ్ పాయ్ గారిని తాను పరిగి తాలూకా అధ్యక్షుని హోదాలో పరిగి పట్టణంలో ఒక బహిరంగ సభను ఏర్పాటు చేసి దానికి ముఖ్య అతిథిగా వాజ్‌పాయ్ గారిని పిలిపించడం జరిగింది.

అంతేకాకుండా 1982 లోనే ఎమ్మెల్యే ఐతాడు పరిగి నియోజకవర్గానికి అనే నానుడి ఎంతో ప్రజల నాలుక పైన ఆడేది. ఒక్కసారి ఆయన బాల్యం గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తే .. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఒక రైతు బిడ్డ. విద్యాభ్యాసం:- వెన్నచెడ్ గ్రామం, గండేడ్ మండలం, పరిగి తాలూకా, మెహబూబ్ నగర్ జిల్లా నుంచి 1969లో మెట్రిక్యులేషన్ పాస్ అవ్వడం జరిగింది.

ఇంటర్మీడియట్ విద్య మహమ్మదాబాద్, పరిగి తాలూకా. డిగ్రీ వచ్చేసి మహబూబ్నగర్ పట్టణం. హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎల్ ఎల్ బి పట్టా పొంది 1979 ఫిబ్రవరి 1న న్యాయవాదిగా ఎన్రోల్ కావడం జరిగింది.

అప్పటి సీనియర్ న్యాయవాది లక్ష్మీకాంత్ రెడ్డి వద్ద కొన్ని నెలలు మాత్రమే జూనియర్ సిప్ గా చేసి తర్వాత ఇండిపెండెంట్ అడ్వకేట్ గా చలామణి అయి 1984లో కుటుంబ పెద్దల మరియు రాజకీయాల్లో ఉండే కొంతమంది సలహాతో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా వికారాబాద్ కోర్టులో ఉద్యోగంలో చేరడం జరిగింది.

అక్కడ మొదలైన ఆయన ప్రభంజనం ఆ రోజుల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని కొమ్ములు తిరిగిన రాజకీయ నాయకులు కుల పెద్దలు పలుకుబడి కలవారందరూ కూడా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటయ్య సార్ వద్దకు వచ్చి ఎన్నో రకాల సలహాలు సూచనలు పొందే వారంటే ఆయన ఏ పాటి మేధావి నొ అర్థం చేసుకోవచ్చు.

అంతేకాకుండా 1982లోనే కమతం రాంరెడ్డి లాంటి నాయకులు మెచ్చుకునే విధంగా ఆనాడు నందమూరి తారక



రామారావు గారు పరిగి నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని ఆఫర్ చేయడం జరిగింది.. అప్పట్లో ఈయన వికారాబాద్ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్న సందర్భం...

ఒకవైపు ఈయనను రాజకీయ పార్టీలు ఈయన వైపు చూడడం, మరోవైపు వికారాబాద్ అప్పటి పశ్చిమ రంగారెడ్డి జిల్లాలోని అన్ని వర్గాల న్యాయవాదులతో మొదలుకొని అందరి న్యాయవాదులకు ఎన్నో సలహాలు సూచనలు ఇచ్చి వారికి వెన్నుదన్నుగా ఉండేవారు వెంకటయ్య సార్.

ఆయన చెప్పేవారు ఇంతటి కమిట్మెంట్, చరిస్మా రావడానికి గల ముఖ్య కారణం విద్యార్థి దశలో షెడ్యూల్డ్ కులాల హాస్టల్లో భోజనం చేసి ఆర్య సమాజ్ ప్లాట్ఫామ్ గా చదువుకుంటూ.. చదువుకుంటూ విద్యార్థి దశను కొనసాగించేవారు, అంతేకాకుండా ఇంటికి పెద్ద కొడుకు అయినా బాధ్యత మరవకుండా తమ్ముళ్లను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దడం జరిగింది.

జాతీయ వాదం, ఎంతో దేశభక్తి మరియు ఆధ్యాత్మిక చింతన చాలా మక్కువ ఆయనకు దానికి ఉదాహరణగా అనంతపద్మనాభ స్వామి ఆలయం నుంచి గుండం వరకు మెట్లు నిర్మించే కార్యక్రమం పూనుకున్న సమయంలో అప్పట్లోనే అక్కడ ఐదు మెట్లు కట్టించిన మహా భక్తుడు వెంకటయ్య సార్,

సామాజిక స్పృహతో ఇప్పుడు ఎంతోమంది పేదలు పెళ్లిళ్లకు వగైరా కార్యక్రమాలకు ఎంతో సౌకర్యంగా ఉన్నటువంటి వికారాబాద్ క్లబ్. ఫంక్షన్ హాల్ లో నిర్మాణంలో కీలకంగా తన పలుకుబడితో దాని నిర్మాణానికి పునాదులు వేసి భూమి పూజ కూడా తనే స్వయానా చేయడం జరిగింది. ఇది 1987 అక్టోబర్ 2న విజయదశమి రోజు భూమి పూజ చేయడం జరిగింది,

ఎస్సీ ఎస్టీ బీసీలకు ఆ కాలంలో ఎంతో పెద్దదిక్కుగా పెద్దన్నగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఈయననే ప్రముఖులు,

శ్రీ అనంతపద్మనాభ కాలేజ్ వికాస్ మండలి కమిటీలో సభ్యులు ఆయన.

ఇదంతా ఒక ఎత్తు అయితే ఎన్నోసార్లు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన లెక్కచేయకుండా నాయకత్వాన్ని మాత్రమే ఎంచుకున్న వ్యక్తి వెంకటయ్య సార్ అప్పట్లో ఇన్కమ్ టాక్స్ డైరెక్టర్ గా జాబు వస్తే తృణప్రాయంగా వదిలేసి పేదల పక్షాన నిలబడడానికి నాయకత్వాన్ని ఎంచుకున్న మహా గొప్ప ముందుచూపరి ఆయన... అయితే ఉద్యోగరీత్యా పబ్లిక్ ప్రాసిక్యూటర్ జాబు లో చేరడానికి గల ముఖ్య కారణం కొంతమంది రాజకీయ ఆశావాదులు ఈయన సమకాలీకులు గా కొనసాగుతూ ఈయన ప్రజల్లో ఉన్నంతవరకు మన పప్పులు ఉడుకవని గ్రహించి ఆయన కుటుంబ సభ్యులను మచ్చిక చేసుకుని వారి నుండి ఒత్తిడి వచ్చే విధంగా చేసి ఉద్యోగంలో చేర్పించి వాళ్ళు రాజకీయాలు చేసుకోవడం జరిగింది. అయినప్పటికీని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఉండి వికారాబాద్ తో పాటు జహీరాబాద్, నారాయణఖేడ్, తాండూర్, చేవెళ్ల, నాంపల్లి వివిధ కోర్టులలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, ఒక వెలుగు వెలగడం జరిగింది అయితే విధి వక్రీకరించిన విధంగా యాక్సిడెంట్ అనే మహమ్మారి ఆయన జీవితాన్ని చిదిమేసినంత పని ఆయన సంఘటన 1996లో జరిగిన కారణంగా ఆయన జీవితం మరో మలుపు తిరగడం జరిగింది. దాని కారణంగానే ఆయన ఎంతో చురుకైన మెదడు గల వ్యక్తి కొంత మతిమరుపుకు గురి కావడం జరిగింది.

దాని కారణంగా ఉద్యోగరీత్యా ఎన్నో రాజకీయ కుట్రలకు బలి కావడం జరిగింది.

ఏది ఏమైనప్పటికిని ఆనాడు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మొదలుకొని నేటి వికారాబాద్ జిల్లా లోని నాటి కమతం రామిరెడ్డి ఇంద్రారెడ్డి లాంటి మహా యోధుల సమకాలికుడు ఆయన ఈనాడు ఒక వెలుగు వెలుగుతున్న రాజకీయ నాయకుల అందరికీ కూడా ఈయనే రాజకీయ గురువుగా చెప్పుకోవడంలో ఎలాంటి సంశయం లేదని చెప్పడానికి ఉదాహరణ సుదీర్ఘ రాజకీయాలు నడిపిన పరిగి మాజీ శాసనసభ స్పీకర్ శ్రీ కొప్పుల హరీశ్వర్ రెడ్డి లాంటి వారు ఈయన ఆఫీసులో ఉండి ఒక గ్రామం ఉప సర్పంచ్ గా ఎన్నిక కావడంలో కూడా ఈయనే కీలక పాత్ర పోషించారు చెప్పుకుంటారు ఆనాడు ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు ప్రతి రాజకీయ నాయకుడు ఆయన ఇంటి గడప తొక్కనివారే లేరనే విషయాన్ని తెలియపరుస్తూ ఇలాంటి యోధున్ని చరిత్రలో నిలిచిపోయే విధంగా స్మరించుకోవాలని ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా వికారాబాద్ లోని సత్య భారతి ఫంక్షన్ హాల్లో సంస్కరణ సభకు హాజరై ఆయనకు ఘనమైన నివాళులు అర్పించడం జరిగింది. పి ఆనంద్ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు న్యాయవాదులు పార్థసారథి గారు సీనియర్ నాయకులు లంక సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళ ఇద్దరు పిల్లలతో అదృశ్యం..

**కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న తుకారం గేట్ పోలీసులు..**

**(శుభ తెలంగాణ/సికింద్రాబాద్)** మహేంద్ర హిల్స్‌లో నివసిస్తున్న మేరీ దీపాలే,ఆమె చెల్లెలు కృప పమ్మి మరియు ఆమె ఇద్దరు పిల్లలు అదృశ్యమైనట్లు శనివారం తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సంఘటనపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు(క్రైమ్.నెంబర్: 261/2024).ఈ కేసును ఎస్ఐ మాన్ సింగ్ పరిశీలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే అదృశ్యమైన తేదీ 26 సెప్టెంబర్ 2024 మధ్యాహ్నం12:30కు,ఫిర్యాదు చేసిన తేదీ 28 సెప్టెంబర్ 2024 రాత్రి 9:00 గంటలకు.మేరీ దీపాలే తెలిపిన వివరాల ప్రకారం,ఆమె చెల్లెలు కృప పమ్మి (35 సంవత్సరాలు) యునైటెడ్ కింగ్డమ్‌లో నివసిస్తోంది.కుటుంబ కలహాల కారణంగా,ఆమె 2024 సెప్టెంబర్ 19న తన ఇద్దరు పిల్లలు జోర్డాన్(12 సంవత్సరాలు) మరియు జేడాన్ (8 సంవత్సరాలు)తో కలిసి భారత్‌కు వచ్చింది.సెప్టెంబర్ 22న కృప,తన చెల్లెలు మేరీ ఇంటికి(మహేంద్ర హిల్స్) వచ్చి, కొన్ని రోజులు అక్కడ గడపాలని నిర్ణయించుకుంది.అయితే,సెప్టెంబర్ 25న కృప భర్త వరుణ్ హైదరాబాదుకు వచ్చి ఆమెను కలవడానికి ప్రయత్నించడంతో,ఆమె భయపడింది.సెప్టెంబర్ 26న మధ్యాహ్నం 12:15 గంటలకు కృప,తన పిల్లలను తీసుకొని తన చెల్లెలు ఇంటికి వచ్చారు. అయితే మళ్లీ మధ్యాహ్నం



12:30 గంటల సమయంలో ఆటోలో తిరిగి బయలుదేరారు.ఆమె అనుకోకుండా వాట్సాప్ చర్చ గ్రూప్ నుండి నిష్క్రమించడం వల్ల ఇంట్లో వారు అనుమానం వ్యక్తం చేశారు.ఆమెను సంప్రదించేందుకు ఫోన్ చేసినప్పటికీ,ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని.మరుసటి రోజు,సెప్టెంబర్ 27న,కృప పమ్మి తన చెల్లెలు మేరీ మరియు అన్నయ్య ప్రభుకు వాట్సాప్ సందేశం పంపింది.అందులో "మేము సురక్షితంగా ఉన్నాము,కాబట్టి మా కోసం వెతకవద్దు.మా వివాహ విభేదాలు పరిష్కరించబడిన తరువాతే మేము తిరిగి వస్తాం"అని పేర్కొంది.

**మిస్సింగ్ వ్యక్తుల వివరాలు:**

1. కృపా పమ్మిలి
   - వయస్సు: 35 సంవత్సరాలు
   - యుకే నివాసి
   - ఆపిల్ కంపెనీ ఉద్యోగి
   - దుస్తులు: బ్లాక్ షర్ట్,బ్లాక్ ట్రౌజర్,బ్లాక్ దుపట్టా
   - ఎత్తు:5.5 అడుగులు
   - భాషలు:తెలుగు,ఇంగ్లీష్
2. **జోర్డాన్**
   - వయస్సు:12 సంవత్సరాలు
   - దుస్తులు:బ్లాక్ టీ-షర్ట్,ట్రాక్ ప్యాంట్
3. **జేడన్**
   - వయస్సు:8 సంవత్సరాలు
   - దుస్తులు:బ్లాక్ టీ-షర్ట్,బ్లూ షార్ట్స్

ఈ కేసును విచారిస్తున్న తుకారం గేట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మాన్ సింగ్ మాట్లాడుతూ,"బాధితులను సురక్షితంగా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నాము" అని తెలిపారు.

## గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

**- మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్**

**- గంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు**




**చేవెళ్ల, శుభ తెలంగాణ:** గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని చేవెళ్ల మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ అన్నారు. గతంలో కురిసిన వర్షాలకు ఊరెళ్ల టు చేవెళ్ల రోడ్డు గుంతలయమంగా తయారవ్వడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ స్పందించి ఆదివారం స్థానిక నాయకులతో కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. జేసీబీతో గుంతల్లో మట్టిని పోయించి చదును చేయించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానని, అభివృద్ధిలో గ్రామ పెద్దలు, యువకులు పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జహంగీర్, ఉప బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోకిల లో బీజేపీ సభ్యత్వ నమోదు



**చేవెళ్ల, శుభ తెలంగాణ:** శంకర్‌పల్లి మండల పరిధి మోకిల, కొండకల్, కొండకల్ తండాలో బీజేపీ సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి పార్టీ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములు గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గడ్డమీది వెంకటేష్, కొండకల్ గ్రామ బూత్ లెవెల్ ఇన్‌చార్జిలు బద్దం రాంరెడ్డి, మైసయ్య, అశోక్, రాజు, శ్రీకాంత్, వినయ్, మల్లేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చేవెళ్ల, **శుభ తెలంగాణ:** 1997-98 సంవత్సరంలో చన్‌వెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు దాదాపు 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి పాత తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరితో ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్న అనంతరం కలిసి సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు నాణ్యమైన పౌష్టిక అల్పాహారం



కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల పిల్లలకు నాణ్యమైన పౌష్టిక అల్పాహారం అందించే కార్యక్రమానికి ప్రఖ్యాత వయాట్రిస్ ఫార్మా సంస్థ తమ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.6.4కోట్లు విరాళంగా ఇచ్చింది. హరేకృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద కొడంగల్ నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లోని 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సమక్షంలో ఈ మేరకు రెండు సంస్థల మధ్య అవగాన ఒప్పందం కుదిరింది. వయాట్రిస్ సీఎస్ఆర్ విభాగం బాధ్యురాలు మిచెల్ డొమినికా గారు, హెచ్‌కెఎమ్ ఛారిటబుల్ ఫౌండేషన్ సీఈవో కౌంతేయ దాస గారు పరస్పరం ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు. సీఎస్ఆర్ వ్యవహారాలు పర్యవేక్షించే %ు-ాx+% విభాగం హెడ్ అర్చన సురేశ్ గారు, కొడంగల్ ఏరియా అర్బన్ డెవలప్?మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి గారు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పారిశుద్ధ్య సేవకులకు హెల్త్ క్యాంప్..




వికారాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా అనునిత్యం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సేవకులు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ గారు అన్నారు. ఈరోజు చైర్ పర్సన్ గారి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా మున్సిపల్ పారిశుద్ధ్య సేవకులకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహమ్మద్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఎస్ఐ ఏసు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కబ్జా చెర వీడిన 30 కోట్ల ప్రభుత్వ భూమి

**అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేసి ఐదెకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న మొయినాబాద్ రెవెన్యూ అధికారులు**

**ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే జైలుకు పంపిస్తామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరిక**





**మొయినాబాద్, శుభ తెలంగాణ:** కనకమామిడి గ్రామ శివారులోని కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 510/%ా% విస్తీర్ణం (5) ఎకరాల భూమిని రాత్రికి రాత్రే కబ్జా చేసి, ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ (ఫ్రీ కాస్ట్ వాల్ ను) నిర్మించి అందులో గదులు నిర్మిస్తున్నారని స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ కె.గౌతమ్ కుమార్ నిన్న మండల గిర్దవర్ సుజిత్ రెడ్డి, సర్వేయర్ బి.జలజ లను విచారణ చేసి వెంటనే ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆదేశించగా, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి ప్రక్కన ఉన్న సర్వే నెం.261 పట్టా భూమి పేరు చెప్పి ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి అట్టి భూమిని కబ్జా చేసి చుట్టూ ఫెన్సింగ్ వేసి, గదులు నిర్మించారని,లే అవుట్ వేసి ప్లాట్స్ గా అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని నిర్ధారించుకున్న రెవెన్యూ అధికారులు అట్టి భూమి చుట్టూ వేసిన అక్రమ నిర్మాణాలు ఫ్రీ కాస్ట్ ఫెన్సింగ్ ను, గదులను జేసీబీ సహాయంతో కూల్చివేశారు.అనంతరం ప్రభుత్వ భూమి సూచిక బోర్డు ఏర్పాటు చేశారు.బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని తహసీల్దార్ గౌతమ్ కుమార్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తో పాటు మండల గిర్దావర్ సుజీత్, రెవెన్యూ సిబ్బంది భాస్కర్, భరత్, మహేష్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి



**చేవెళ్ల, శుభ తెలంగాణ:** షాబాద్ మండల పరిధి చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్?? హార్ట్? డే సందర్భంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, ప్రతి రోజు వ్యాయామం, నడక తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చందనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు స్వర్ణలత, వైద్య సిబ్బంది నవీన్, మల్లేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా కన్నీటి గాథలు



**హైదరాబాద్ :** రువుల పరిరక్షణ, ప్రభుత్వ భూముల రక్షణ కోసం హైడ్రా పని చేస్తుందని వార్తలు వచ్చినప్పుడు.. మంచిదే కదా అని అందరూ అనుకున్నారు. పెద్ద పెద్ద వ్యక్తుల నిర్మాణాలు కూల్చివేస్తుంటే.. కరెక్టే కదా అని చర్చించుకున్నారు. కానీ ఇప్పుడు ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలు కన్నీరు పెడుతున్నారు. తాజాగా.. హైదరాబాద్ నగరం చైతన్యపురి మూసీ నది ఏరియాలో అధికారులు సర్వే చేపట్టి.. కూల్చివేయాల్సిన వాటికి మార్క్ చేస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు.'నా భార్య 9 నెలల కడుపుతో ఉంది. ఇప్పుడు ఉన్నపళంగా వచ్చి మా ఇల్లు కూల్చేస్తే.. మేము ఎక్కడికి పోవాలి' అని ఆవేదన వ్యక్తం చేస్తూ.. చైతన్యపురిలో పెట్రోల్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టా భూమిలోనే ఇల్లు కట్టుకున్నాం.. కరెంట్ బిల్లు, ఇంటి పన్ను అన్ని కడుతున్నామని వాపోయాడు. అయినా అతని ఇల్లు నిలబడటం లేదు.'కనీసం నోటీస్ కూడా ఇవ్వకుండా ఇంటికి వచ్చి బెదిరిస్తున్నారు.. ఏమైనా మాట్లాడితే కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ బుక్ చేస్తాం అంటున్నారు. ఇంట్లో ఆడవాళ్లు భయపడి.. బీపీ, షుగర్ పెరిగిపోతున్నాయి. కాళ్లు, చేతులు ఆడట్లేదు. ప్రశ్నిస్తే కేసు వేస్తామని జీప్ ఎక్కించడానికి లాక్కుపోతున్నారు' అని మరో బాధితుడు చెబుతూ.. కన్నీటి పర్యంతం అయ్యారు.'మేం ఇంట్లోనే ఉంటాం. మా ఇల్లు కూలగొట్టి మమ్మల్ని చంపి మూసీ నదిలో పడేయండి. గత ప్రభుత్వం ఉన్నప్పుడే బాగుండే. రాత్రికి రాత్రి ఇళ్లకు మార్కింగ్ వేసి పోతున్నారు. అసలు నిద్రపోకుండా భయం భయంగా బతుకుతున్నాం' అని ఓ మహిళ గుండె బాదుకుంది. ఇన్నాళ్లు లేని సమస్య ఇప్పుడే ఎలా వచ్చిందని ప్రశ్నించింది.ఈ నెల 8న సున్నం చెరువు కూల్చివేతలతో అంజలి అనే మహిళ తన గుడిసెను కోల్పోయింది. అంజలి తన సోదరుడి ఇంటికి తల దాచుకోవడానికి వెళ్లి.. అక్కడే గుండె పోటుతో మృతి చెందింది.విజయ్ ప్రతాప్ గౌడ్ అనే వ్యక్తి.. రూ.50 లక్షలతో ఫుడ్ కేటరింగ్ పెట్టుకున్నాడు. 68 మందిని తన దగ్గర పనికి చేర్చుకున్నాడు. హైడ్రా కూల్చివేతలో తన కేటరింగ్ గోడౌన్ నేలమట్టం అయ్యింది. దీంతో రూ.50 లక్షలు నష్టం జరిగింది. 68 మంది ఉపాధి కోల్పోయారు.కడుపుతో ఉన్న తన భార్య రోదిస్తున్నా.. సామగ్రిని బయట పెట్టుకోడానికి అధికారులు సమయం ఇవ్వలేదని రవి అనే బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా హైదరాబాద్ నగరంలో ఎందరో కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇంకా కొందరైతే.. తమ కూల్చే సమయంలోనే.. తమను కూడా చంపేయండని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తాము ఇంటి పన్ను, నల్లా పన్ను, కరెంట్ బిల్లు కడుతున్నామని బాధితులు చెబుతున్నారు. అనుమతి లేకుండా నిర్మిస్తే.. ఇవన్నీ ఎందుకు చెల్లిస్తామని ప్రశ్నిస్తున్నారు. అప్పుడు అధికారులే అనుమతి ఇచ్చి.. ఇప్పుడు వారే కూల్చేస్తే ఎలా అని నిలదీస్తున్నారు. నిర్మాణం అక్రమం అయితే.. కట్టినప్పుడు ఏం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌లు కొన్నవారు దీనస్థితిలో ఉన్నారు. బిల్డర్ తమకు అమ్మితే కొనుక్కున్నాం.. ఇప్పుడు కూలిస్తే.. తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# చారిత్రాత్మక భవనాలకు కొత్త హంగులు



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణ ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్ద పీట వేయనుందా ? ప్రజా ప్రభుత్వం లక్ష్యం ఏంటి ? సంక్షేమం, అభివృద్ధిని రేవంత్ సర్కార్ జోడు ఏడ్లుగా పరుగులు పెట్టిస్తోందా ? ఈ జాబితాలో టూరిజం రంగాన్ని సైతం చేర్చనుందా అని అంటే మాత్రం సమాధానం అవుననే చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే చారిత్రాత్మక భవనాలకు తాము ప్రయారిటీ ఇస్తామంటున్నారు ప్రభుత్వాధినేత. హైదరాబాద్ మహానగరంలోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐతో పర్యాటక శాఖ ఒప్పందం చేసుకుంది మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని, ఇందుకోసం పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు.హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణలో భాగం కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమంతో పాటే పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని సైతం తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య ఫలితమే ఎన్నో హిస్టారికల్ బిల్డింగ్స్ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్దరించేందుకు నిర్ణయించామని, త్వరలోనే అక్కడ శాసనమండలి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత మండలి ఉన్న జూబ్లీహాల్‌కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. స్పెషల్ టెక్నాలజీ ఉపయోగించి ఆ భవనాన్ని నిర్మించారన్నారు.దాన్ని భవిష్యత్ తరాలకు సైతం అందించేందుకు కృషి చేస్తున్నామని, అందుకే జూబ్లీహాల్ ను దత్తత తీసుకుని పరిరక్షించాలని సీఐఐని కోరారుఇక నైజాం కట్టడాల్లో మరో పురాతనమైనది ఉస్మానియా ఆస్పత్రి. ఈ భవనాన్ని సైతం పరిరక్షిస్తామన్నారు. అయితే ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నామన్నారు. హైకోర్టు భవనం హెరిటేజ్ భవనంగా విరాజిల్లుతోందని, దీని పరిరక్షణలో భాగంగానే ఉన్నత న్యాయస్థానాన్ని సైతం తరలిస్తున్నామన్నారు. హైకోర్టు నూతన భవన నిర్మాణం కోసం రాజేంద్ర నగర్ ప్రాంతంలో దాదాపు 100 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు.హైదరాబాద్ సిటీ కాలేజ్ బిల్డింగ్ సహా పురానాపూల్ బ్రిడ్జి లాంటి చారిత్రక కట్టడాల పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరాన్ని సీఎం నొక్కి చెప్పారు. ఈ జాబితాలో ఇప్పటికే 400 ఏళ్ల నాటి చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు పలువురు పారిశ్రామికవేత్తలు సానుకూలంగా స్పందించడమే కాదు పురాతన బావులను సైతం దత్తత తీసుకున్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒప్పంద పత్రాలను సైతం అందజేయడం విశేషం.ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్దరణకు మరో కార్పోరేట్ సంస్థ ఇన్ఫోసిస్ ముందుకు వచ్చింది. మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సంస్థ దత్తత తీసుకోగా, ఇక సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను భారత్ బయోటెక్ సంస్థ పునరుద్దరించబోతోంది.అడిక్‌మెట్ మెట్ల బావి, దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావి టీజీఆర్టీసీ తీర్చిదిద్దనుంది. ఇక ప్రఖ్యాత రెసిడెన్సీ మెట్ల బావి పరిరక్షణ బాధ్యతను కోఠి ఉమెన్స్ కాలేజీ స్వీకరించింది.ప్రభుత్వ విద్యార్థులకు రేవంత్ సర్కార్ మరో అద్భుత కానుకను అందించింది. రాష్ట్రంలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించే అవకాశం కల్పించింది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మాటను వెల్లడించడంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువకుంటున్న విద్యార్థులు సంబురపడుతున్నారు. ఈ పథకం పేరును తెలంగాణ దర్శినిగా అమలు చేస్తున్నారట. ఇందుకు సంబంధించిన జీఓను ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిందని రేవంత్ అన్నారు

**తెలంగాణ దర్శిని**

విద్యార్థులు తరగతి గదిలో కూర్చొని విషయాలను పాఠాలుగా వినడం కంటే ప్రత్యక్షంగా చూసి అనుభవించడం వల్ల ఎక్కువ జ్ఞానాన్ని పొందుతారనే శాస్త్రీయ నిరూపణలున్నాయి. ఈ నేపథ్యంలో చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తలపెట్టారు. రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులను కేటగిరీలుగా విభజించి, ఆయా ప్రాంతాల్లోని పర్యాటక క్షేత్రాలను చూపిస్తారు. రవాణా, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రభుత్వం రూ12.10 కోట్ల నిధులు విడుదల చేసింది. తొలి దశలో 1లక్ష మంది విద్యార్థులను పర్యాటక స్థలాలకు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నోడల్ ఆఫీసర్లు నియమించే కమిటీలు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. తెలంగాణ దర్శినికి సంబంధించిన విధివిధానాలను జీవోలో పొందుపర్చారు.హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే చారిత్రక కట్టడాలను పరిరక్షిస్తూ వాటిని పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన ముఖ్యమంత్రి సంకల్పానికి అడుగు ముందుకు పడింది. పలు చారిత్రక పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ప్రతినిధులు ముందుకొచ్చారు. సీఐఐ తెలంగాణ కౌన్సిల్ ప్రతినిధులతో సీఎం గారు సచివాలయంలో సమావేశమయ్యారు.

టూరిజం మంత్రి జూపల్లితో పాటు ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నగరంలోని పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు ఆయా సంస్థలు ముందుకొచ్చి సీఎం సమక్షంలో పర్యాటక శాఖతో ఒప్పందాలు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ? హైదరాబాద్ చారిత్రక కట్టడాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వాటి పరిరక్షణ కోసం పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మూసీ పరివాహన ప్రాంతంలో చారిత్రక భవనాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని, మూసీ ప్రక్షాళన కార్యక్రమం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని చెప్పారు. పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్దరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసనమండలి కార్యకలాపాలు నిర్వహిస్తామని వెల్లడించారు. జూబ్లీహాల్‌కు చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సీఐఐకి సూచించారు.

# సంక్రాంతికి మూవీ ఫెస్టివల్...

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** ప్రతి ఏడాది సంక్రాంతికి సినిమాల సందడి ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ ఏడాది డిసెంబర్ లో సినిమాల జాతర ఎక్కువగానే ఉంటుంది. ఈ ఏడాది చివరిలో రామ్ చరణ్, అల్లు అర్జున్ సినిమాలు విడుదల కాబోతున్నాయి. ఇక సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు ప్రజలతో పాటుగా సినీ ఇండస్ట్రీలో కూడా సందడి వాతావరణం నెలకొంటుంది. కొత్త సినిమాలు వరుసగా రిలీజ్ అవుతాయి.. అందులో కొన్ని స్టార్ హీరోల సినిమా బాక్సాఫీస్ ను షేక్ చేస్తాయి. ప్రతి ఏడాది సంక్రాంతికి కొత్త సినిమాల సందడి ఎక్కువగానే ఉన్నట్లు వచ్చే కూడా కొత్త సినిమాలు లెక్కలేనన్ని రిలీజ్ కాబోతున్నాయి. డిసెంబర్ లో రావాల్సిన కొన్ని సినిమాలు పోస్ట్ పోన్ అయ్యి సంక్రాంతికి విడుదల కాబోతున్నాయని వార్తలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. మరి ఆలస్యం ఎందుకు వచ్చే సంక్రాంతి రేసులో ఏ హీరో సినిమా బరిలోకి దిగుతున్నారు...2025 సంక్రాంతి సినీ ప్రియులకు ఫుల్ మీల్స్ ఇవ్వనుందని తెలుస్తుంది. ఈ పండుగ సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర', నందమూరి బాలకృష్ణ 'ఔఃఐ109', విక్టరీ వెంకటేష్ మరియు అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న చిత్రం, అలాగే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మూవీ వంటి పలు స్టార్ హీరోల సినిమాలు సంక్రాంతి రేసులో ఉండనున్నాయి. ఇకపోతే కోలీవుడ్ నుంచి కూడా సంక్రాంతి రేసులో స్టార్ హీరోలు పాల్గొంటున్నారు. సూర్య నటించిన 'కంగువా' నవంబర్ 14న విడుదల కానున్న నేపథ్యంలో, కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందుతున్న 'సూర్య 44'ను కూడా 2025 సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.తమిళ్లో రిలీజ్ కాబోతున్న సినిమాలు తెలుగులో డబ్ అయి విడుదల కాబోతున్నాయి. దాంతో ఇక్కడ రిలీజ్ కాబోతున్న సినిమాలకు పోటి తప్పలేదు. ముఖ్యంగా సూర్యకు తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండటం తో, ఆయన చిత్రాలు తెలుగు మార్కెట్‌లో కూడా గట్టిగా ప్రభావితం చేస్తాయని భావిస్తున్నారు.. ఆయనకు నుంచి తెలుగులోకి వచ్చిన ప్రతి సినిమా భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇక సూర్య 44 లో స్టైలిష్‌గా కనిపించనున్నారు, అలాగే ఫైట్ సీక్వెన్స్‌లు అద్భుతంగా ఉంటాయని సమాచారం. ఈ చిత్రంలో సూర్య సరసన బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించనుందని టాక్ వినిపిస్తుంది. ఈ మూవీని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ లో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అంటే ఈ సంక్రాంతికి తెలుగు, తమిళ్లో స్టార్ హీరోల మధ్య పోటి తప్పేలా లేదు. ఇక వచ్చే ఏడాది సీనియర్ హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే వచ్చే సంక్రాంతికి స్టార్ హీరోల సినిమాలు తక్కువగానే ఉన్నాయి.. ఈ సంక్రాంతి కాస్త సినిమాలు తక్కువగా ఉన్నాయి. ఉన్న సినిమాల్లో ఏ సినిమా ఎలాంటి టాక్ ను అందుకుంటుందో చూడాలి? చూద్దాం ఏ సినిమా హిట్ టాక్ ను అందుకుంటుందో.. మరే సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతుందో చూద్దాం..

## బతుకమ్మ నుంచి కవిత రీ ఎంట్రీ



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ బిడ్డ, ఎమ్మెల్సీ కవిత రాజకీయ అడు గులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టై బెయిల్‌పై బయటకు వచ్చిన కవిత? ఇప్పటివరకు రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తన అరెస్టుకు ముందు రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్న కవిత? బెయిల్ వచ్చి సుమారు నెల రోజులు అవుతున్నా సైలెంట్‌గా ఉండటం పట్ల ఆమె అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆమె గతంలో ప్రాతినిధ్యం వహించిన నిజమాబాద్‌లోనూ ఇప్పటివరకు అడుగు పెట్టలేదు. ఐతే, రాజకీయ ప్రత్యర్థులు మాత్రం కవితను రెచ్చగొట్టేలా విమర్శల దాడి చేస్తున్నారు. దీంతో విశ్రాంతికి సెలవు ప్రకటించి తనపై రాజకీయ విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని డిసైడ్ అయ్యారట కవిత. అందుకే తన రీ ఎంట్రీ గ్రాండ్‌గా ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇందుకోసం తన బ్రాండ్ బతుకమ్మను వేదికగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.ఉద్యమ కాలం నుంచి బతుకమ్మ సంబరాలతో తనకో బ్రాండ్ సంపాదించుకున్నారు కవిత. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలకు ప్రాచుర్యం తీసుకువచ్చారు. ఇక కొన్నాళ్లుగా విశ్రాంతి తీసుకుంటున్న కవిత? ఇప్పుడు బతుకమ్మ పండగ ద్వారా మళ్లీ రీ ఎంట్రీ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. గతంలో కంటే దూకుడుగా రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు? తనపై వచ్చిన ఆరోపణలు, అభియోగాలకు కౌంటర్ ఇస్తూ ముందుకు వెళ్లాలనుకుంటున్నారని సమాచారం. సరైన వేదిక కోసం చూస్తున్న కవిత? బతుకమ్మ పండుగను సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నారని అంటున్నారు.ఇప్పటికే కవిత పార్టీ సీనియర్స్, మేధావులతో సమావేశమై, రాజకీయ వ్యూహాలపై సమాలోచనలు చేస్తున్నారట. మెజారిటీ నేతలు బతుకమ్మతోనే గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని సూచన చేసినట్లు చెబుతున్నారు. ఇక కవితను కలుస్తున్న కార్యకర్తలు సైతం బతుకమ్మతోనే ఎంట్రీ ఇవ్వాలని కోరుతున్నారట. మరోవైపు అధికారం కోల్పోయిన నుంచి బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఒత్తిడికి లోనవుతోంది. ఓటమి భారంతో అధినేత ఫామ్ హౌస్‌లోనే ఎక్కువగా గడుపుతుండగా, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పార్టీ బాధ్యతలను తమ భుజాలపై మోస్తున్నారు. వీరికి కవిత కూడా తోడైతే రాజకీయంగా బలం పుంజుకోవచ్చని భావిస్తున్నారు.ఇక ప్రజల్లో వెళ్లడానికి సిద్ధమవుతున్న కవితకు పార్టీ ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుంది? ఆమె రోల్ ఎలా ఉండబోతుందనేది క్లారిటీ రావాల్సి ఉంది. కుమార్తె రీ ఎంట్రీ విషయంలో అధినేత కేసీఆర్ ఆలోచనలు ఏంటనేది ఆసక్తికరంగా మారింది. కవితకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలని కేసీఆర్ ఆలోచన చేస్తున్నారంటున్నారు. ఢిల్లీ స్థాయిలో బాధ్యతలివ్వాలా? రాష్ట్ర స్థాయిలోనా? అనేది ఇంకా తెలియరాలేదు. ఏదిఏమైనా కవిత రీ ఎంట్రీతో బీఆర్ఎస్‌లో జోష్ తీసుకురావాలనే ప్లానింగ్ జరుగుతోందంటున్నారు.

## మూసీపై తలో మాట....

**హైదరాబాద్ :** "హైదరాబాద్‌లో 28వేల అక్రమ కట్టడాలు ఉన్నాయి. ఇకపై కొత్త వాటికి ఛాన్స్ లేదు. అన్నింటినీ కూల్చివేయాల్సిందే".. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇవి. నగరానికి వరదలు వచ్చిన సమయంలో, అక్రమ కట్టడాల వల్లే కాలనీలు నీట మునిగిన సందర్భంలో కేసీఆర్ ఈ కామెంట్స్ చేశారు. ట్విస్ట్ ఏంటంటే, కేసీఆర్ వ్యాఖ్యలకు విరుద్ధంగా ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. తండ్రి ఒక మాట, కుమారుడు మరో బాటలో వెళ్తుండడంతో, కేడర్‌ను కన్ఫ్యూజ్‌లోకి నెడుతోంది.

## నీటి పారుదల వ్యవస్థలో అవినీటి అధికారులు...

**హైదరాబాద్, శుభ తెలంగాణ :** వ్యవసాయరంగంలో ఎండనకా వాననకా ప్రకృతి వైపరిత్యాలకకు ఎదురొడ్డి పంటలు పండిస్తున్న రైతులకు సాయ పడాలన్న ఉద్దేశంతో ఆ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పొలాలో వ్యవసాయ బావులు ఎండిపో యి.. పంటలు కాపాడుకోలేని పరిస్థితులో ఆ బావులు పూర్తిగా పాడుబడి పో కుండా వాటిలో బోర్లు వేసి తిరిగి నీటివూటను పెంపోందించి రైతుకు చేయూత నివ్వాలన్న లక్షంతో ప్రభుత్వం తెలంగాణ అవినీటిపారుదల అధికారులు సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థను ఏర్పాటు చేసింది.అయితే అందులో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు అవినీతి రుచిమరిగి దాన్ని అవినీతిపారుదల సంస్థగా మార్చుకున్నారు. ఆ సంస్థకు చెదిన కీలక స్థానంలో ఉన్న అధికారిని తమ అక్రమాలు కొమ్ముకాసేలా చేసుకుని యధేశ్చగా అవినీతికి పాల్పడుతున్నట్టు తెలిసింది.గ్రామీణ నీటిపారుదల సంస్థ అసలు లక్ష్యాలు ఏనాడో కరుమరుగైపోయాయి. ఇప్పుడు ఆ సంస్థ ఉద్యోగులు ఇతర శాఖల పనులు చేస్తున్నారు. ఏటా వేలకోట్ల విలువైన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల పనులు చేయిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను అవకాశంగా మలుచుకున్నారు. అనుకూలమైన వారికి అమ్యామ్యాలు అందజేసి కలెక్టర్ల ద్వారా ఈ పనులకు నిధులు మంజూరు చేయించుకుంటున్నారు. ఇందులో పనిచేసే ముగ్గురు అధికారులు తమ బాస్‌ను అవినీతికి జేమ్స్‌బాండ్‌గా మార్చేసుకున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ అధికారి సారధ్యంలోనే వీరి అవినీతి తెలంగాణకే పరిమితం కాలేదు.తెలుగు రాష్ట్రాలను కూడ దాటి మళయాల రాష్ట్రానికి కూడా పాకిపోయింది. కేరళ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద ఈ అవినీతి అధికారుల ముఠా పనులు చేస్తోంది. తెలగాణ ప్రభుత్వం అనుమతి తీసుకోకుండా పక్కరాష్ట్రాల్లో పనులు చేయడం నేరం అని తెలిసికూడా వీరు ఏడాదిన్నర కాలంగా అక్కడ వందల కోట్ల విలువైన పనులు చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ అడ్డదారిలో ఈ పనులకు కూడా బినామి కాంట్రాక్టు ఏజెన్సీలను శృష్టించుకున్నారు.ఆర్ఎస్ ఇంజనీరింగ్ ,పద్మావతి ఇన్‌ఫ్రా , జిఎన్‌వి ఇంజనీరింంగ్ సర్వీస్ పేర్లతో ఏజెన్సీలను శృష్టించుకున్నారు.ప్రైవేటు ఏజెన్సీలకు ప్రభుత్వ నిధులు అడ్వాన్సుగా ఇవ్వటం నేరం అని తెలిసి కూడా ప్రభుత్వ అనుమతి తీసకుకోకుండానే బినామి కంపెనీలకు గ్రామీణ నీటిపారుదల సంస్థ నుంచి కోట్ల రూపాయలు అడ్వాన్సులు చెల్లించారు. కనీసం ఈ బినామి ఏజెన్సీల నుంచి బ్యాంకు గ్యారేంటీలు కూడా తీసకోలేదని సమాచారం. ఇప్పటికే ఆర్ఎస్ ఇంజనీరింగ్‌కు రూ.6.90కోట్లు , పద్మావతి ఇన్‌ఫ్రాకు రూ.4కోట్లు , జిఎన్‌వికి కూ.2కోట్లు అడ్వాన్సులు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ కంపెనీలు చేతులెత్తేస్తే నీటిపారుదల సంస్థ ఇచ్చిన అడ్వాన్సు నిధులు నీటిపాలైనట్టే .సంస్థకు చెందిన ఆ ముగ్గురు ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ముద్రను వాడేసుకుని కేరళ జల్‌జీవన్ మిషన్ పనులను తమ బినామి ఏజెన్సీలకు కట్టబెట్టించుకున్నారు.వీటికి కనీసం టెండర్లు ప్రక్రియ కూడా నిర్వహించలేదు. మిషన్ పనుల్లో అవసరమైన జిఐ పైపులు ,పివిసి పైపులు ఇతర మెటిరియల్‌ను కొన్ని కంపెనీల నుంచి కారు చౌక ధరలకు నాశిరకానివి కొని , అదే వాటికి అధిక మొత్తంలో బిల్లులు వేయించి సోమ్ము చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ సంస్థకు చెందిన కొందరు ఉద్యోగులు సిసి రోడ్లు , డ్రైన్లలో నాశిరకం పనులు చేసి రాజకీయ పలుకుబడితో భారీగా సోమ్ము చేసుకున్నట్టు సమాచారం. ఏ సంస్థలోనైనా చేసిన పనులకు ఆడిట్ జరగాల్సిందే . అయితే గ్రామీణ నీటిపారుదల సంస్థలోని ఆ ఉద్యోగులు తాము చేయించిన పనులకు వారే ప్రవేటు వ్యక్తుల ద్వారా ఆడిట్ రిపోర్టులు తమకు అనుకూలంగా చేయించి ఆడిట్ అధికారుల చేతులు తడిపి రిపోర్టులకు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వున్నాయి.

తెలంగాణ సహకార గ్రామీణ నీటిపారుదల సంస్థకు ఎండిగా ఉన్న అధికారిని కొనసాంగించుకుకునేందుకు కోసం ఈ సంస్థలోని ముగ్గురు ఉద్యోగులు ఉన్నత స్థాయిలో చక్రం తిప్పుతున్నట్టు తెలిసింది. పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ఈ అధికారి 2012నుంచి 2015వరకూ డిప్యూటేషన్‌పై నీటిపారుదల సంస్థ ఎండిగా పనిచేశారు. మళ్లి అదే ఆధికారి 2022లో రెండవ సారి ఎండిగా డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈ నెల చివరన ఈ అధికారి రిటైర్టు కావాల్సివుంది. ఈ అధికారి విధి నిర్వహణలో చార్జెస్ పడ్డాయి. ఇవి ఇంకా విచారణ దశలోనే ఉన్నట్టు సమాచారం . రిటైర్‌మెంట్ ఆర్డర్స్‌లో చార్జెస్ పెండింగ్‌లోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అధికారినే మళ్లీ ఎండిగా కొనసాగించుకునేలా ఆ ముగ్గురు అధికారులు చేస్తున్న విశ్వప్రయత్నాల వెనుక దాగిన మర్మం గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయంలో గుప్పుమంటోంది. నీటిపారుదల శాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు , అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ కూడా కన్నేసినట్టు సమాచారం.

# ప్లాస్టిక్ ప్యాకేజీలో ఫుడ్ తింటున్నారా..

ప్రస్తుతం ఆహారం వండుకోవడం కూడా కష్టంగా భావిస్తున్నారు. దీంతో బయట ఫుడ్ ని ఆర్డర్ పెట్టుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. దీంతో మన ఇళ్లకు వచ్చే ఆహార పదార్థాల్లో 80 శాతం ఏదో ఒక ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌లో వస్తున్నాయి.పిల్లల చిప్స్ నుంచి పాల ప్యాకెట్లు, బ్రెడ్, సాధారణంగా అన్నీ ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌లోనే వస్తున్నాయి. అయితే ఈ ప్యాకింగ్ సౌకర్యం మన ఆరోగ్యానికి ఎంత హాని చేస్తుందో ఎప్పుడైనా ఆలోచించారా? ఈ ప్లాస్టిక్ ప్యాకేజింగ్ మన ఆరోగ్యానికి ప్రమాదకరమని ప్రకటించబడిన అనేక అధ్యయనాలు వెలువడ్డాయి. ఇటీవలి అధ్యయనం ప్రకారం ఈ ఆహార ప్యాకేజింగ్‌లో అనేక రసాయనాలు ఉన్నాయి. అవి మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతున్నాయి. ఫుడ్ ప్యాకేజింగ్, ప్లాస్టిక్ టేబుల్‌వేర్లలో 200 రసాయనాలు ఉన్నాయని..అవి బ్రెస్ట్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని ఒక పరిశోధనలో వెల్లడైంది. ఆరోగ్య దృక్కోణం నుంచి ఈ హానికరమైన పదార్థాలను తొలగించడం మంచిదని పరిశోధకులు అంటున్నారు. ఎందుకంటే అటువంటి 76 పదార్థాలు చాలా హానికరమైన వ్యక్తులలో కనుగొనబడ్డాయి. దీని కోసం మనం ప్యాకింగ్ కోసం మెరుగైన, రక్షిత ఎంపికను కనుగొనవలసి ఉంటుంది. లేదంటే ఈ ప్లాస్టిక్ ప్యాకేజీ వల్ల వచ్చే వ్యాధుల ముప్పు తగ్గదు. ఫ్రాంటియర్స్ ఇన్ టాక్సికాలజీలో ప్రచురించబడిన ఒక నివేదిక ప్రకారం రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన సుమారు 200 రసాయనాలు ఫుడ్ ప్యాకేజింగ్, ప్లాస్టిక్ టేబుల్‌వేర్‌లలో ఉపయోగించబడుతున్నాయి. పదుల సంఖ్యలో ఈ హానికరమైన రసాయనాలు ఆహారం ద్వారా మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఫుడ్ ప్యాకేజింగ్ ఫోరమ్ పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనాలు ఈ ఫుడ్ ప్యాకేజింగ్ గురించి ఆందోళన వ్యక్తం చేశాయి. ప్యాకేజింగ్ ఎంత మన్నికగా ఉంటే అది మన ఆరోగ్యానికి అంత హానికరం. అధ్యయన రచయిత జేన్ ముంకే ప్రకారం రొమ్ము క్యాన్సర్‌కు కారణమయ్యే ఫుడ్ ప్యాకేజింగ్‌తో సంబంధం ఉన్న ఆహారాల నుంచి వ్యక్తులలో ఇటువంటి 76 రసాయనాలు ఉన్నట్లు కనుగొనబడ్డాయి. ఈ క్యాన్సర్ కేసులను నివారించడానికి ఆహార ప్యాకేజింగ్ నుంచి అటువంటి హానికరమైన రసాయనాలను తొలగించమని సూచిస్తుంది. ఆహార ప్యాకేజీతో పాటు వేడిచేసినప్పుడు ఈ ప్యాకేజీలోని మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలో కలిసిపోతున్నాయి. దీంతో ఆహారంతో పాటు మన శరీరంలోకి ప్రవేశించే అనేక ఉత్పత్తులు ఉన్నాయి. అందువల్ల ప్లాస్టిక్ పాత్రలు లేదా ఆహార ప్యాకేజీలలో ఆహారాన్ని వేడి చేయవద్దు. ఇలా వేడి చేయడం వలన ప్లాస్టిక్ లో ఉండే రసాయనాలు వేడెక్కి ఆహారంలో కలిసిపోతాయి. పెర్‌ఫ్లోరోఅసిల్, పాలీఫ్లోరోఅసిల్ అనేవి ఆహార ప్యాకేజింగ్‌లోని రసాయనాలు.. ఇవి అధిక కొలెస్ట్రాల్, క్యాన్సర్, గుండె జబ్బులకు కారణమవుతాయి.




## మంచి ఆరోగ్యం కోసం..

రాజ్‌గిరాలో యాంటీ డయాబెటిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మైగ్రేన్ తలనొప్పి నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా ఆకలిని కూడా తగ్గిస్తుంది. రామదాన గింజల్లో ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది జంతు ప్రొటీన్‌లా క్వాలిటీగా ఉంటుంది. ఎదిగే పిల్లలకు ప్రొటీన్ చాలా అవసరం. ఎముకలు, కండరాలు, చర్మం, రక్తం పెరుగుదలకు ప్రొటీన్ అవసరం. శరీరం బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకూ ప్రొటీన్ తోడ్పడుతుంది. అమరాంత్ సీడ్స్ గ్లూటెన్ ఫ్రీ. గ్రూటెన్ అలెర్జీ ఉన్నవారు దీన్ని ఆహారంగా తీసుకోవచ్చు. అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి తీవ్రమైన సమస్యలు దరిచేరవు. గింజల్లోనూ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది, పేగుల కదలికలు సక్రమంగా జరిగేలా చూసుకుంటుంది. మలబద్ధకం సమస్యతో బాధపడేవారు తోటకూర గింజలు ఆహారంగా తీసుకుంటే త్వరగా తగ్గుతుంది. రాజ్‌గిరాలో మాంగనీస్ పుష్కలంగా ఉంటుంది. మాంగనీస్ మెదడుకు చాలా ముఖ్యమైనది. కొన్ని నాడీ సంబంధిత పరిస్థితుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. అంతే కాదు, ఉపవాస సమయంలో



వినియోగించే రాజ్‌గిరా ఐరన్‌కు ప్రధాన వనరుగా పనిచేస్తుంది.రాజ్‌గిరాలో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు గుండె ఆరోగ్యాన్ని రక్షిస్తాయి, హైపర్‌టెన్షన్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయి, ఇంకా, అధిక ఫైబర్ తీసుకోవడం శరీర కొవ్వు, బరువు పెరుగుట ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బరువు తగ్గడానికి, ఖచ్చితంగా మీ ఆహారంలో రాజ్‌గిరాను చేర్చుకోండి.

## ఇలా చేస్తే ఈజీగా సన్నబడతారు..!



కానీ, మనం తీసుకునే ఆహారం, జీవనశైలి మార్పుల ద్వారా కూడా సులభంగా బరువు తగ్గేందుకు అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం.. భోజనం మానేయడం, డైటింగ్ చేయడం వల్ల ఈజీగా బరువు తగ్గొచ్చు అనుకుంటారు చాలా మంది. కానీ, మనం తీసుకునే ఆహారం, జీవనశైలి మార్పుల ద్వారా సులభంగా బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. మీరు బరువు తగ్గాలనుకుంటే రాత్రి 7 గంటలలోపు తినడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. రాత్రి భోజనానికి, నిద్రకు మధ్య దాదాపు 3 గంటల గ్యాప్ ఉండాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. రాత్రిపూట లేట్‌గా భోజనం చేయడం వల్ల జీర్ణం సరిగా అవదు. దీంతో జీవక్రియ ప్రభావితం అవుతుంది. దీని కారణంగా శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే, సాయంత్రం త్వరగా తినడం అలవాటు చేసుకోవాలంటున్నారు నిపుణులు. అలాగే, రాత్రిపూట ఎల్లప్పుడూ లైట్‌ఫుడ్ తీసుకోవటం బెటర్ అంటున్నారు. బరువు తగ్గడానికి డిన్నర్‌లో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు. రాత్రిపూట మీరు పచ్చి కూరగాయలు, సూప్, సలాడ్, పప్పు తినవచ్చు. మీకు అర్ధరాత్రి ఆకలిగా అనిపిస్తే, కీర దోసకాయ లేదంటే యాపిల్ వంటి పండ్లను తినొచ్చు. మనం త్వరగా నిద్రపోవడం వల్ల మెలటోనిన్ అనే హార్మోన్ మన శరీరంలో బ్రౌన్ ఫ్యాట్‌ని సృష్టించి కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. రాత్రి బాగా నిద్రపోవడం వల్ల శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది, ఇది వేగంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఊబకాయం అనేది అటు నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. బరువు తగ్గడానికి కనీసం 7 గంటల గాఢ నిద్ర అవసరం. మీకు తగినంత నిద్ర లేకపోతే, అది మీ జీవక్రియను నెమ్మదిస్తుంది. దీంతో బరువు తగ్గడం కష్టంగా మారుతుంది. ఇక మంచి నిద్ర కోసం రాత్రి పుకునే ముందు పసుపు పాలు తాగడం అలవాటు చేసుకోండి. పసుపు పాలు బరువు తగ్గడానికి, మంచి నిద్రకు సహాయపడుతుంది.

## డయాబెటిస్ పేషెంట్లకు శుభవార్త..

ప్రపంచవ్యాప్తంగా 537 మిలియన్లకు పైగా పెద్దలు మధుమేహంతో బాధపడుతున్నారు. 2045 నాటికి ఈ సంఖ్య 783 మిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. అధిక బరువు, జీన్స్ వంటి అంశాలు ఈ దీర్ఘకాలిక వ్యాధికి కారణం అవుతుండగా... ప్యాంక్రియాస్ ఇన్సులిన్ హార్మోన్‌ను ఉత్పత్తి చేయడంలో విఫలమైనప్పుడు టైప్ 2 డయాబెటిస్ వస్తుంది. కణాలు ఇన్సులిన్‌కు నిరోధకతను అభివృద్ధి చేస్తాయి, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. గ్లైసెమిక్ ఇండెక్స్ అధికంగా ఉంటే డయాబెటిస్ వస్తుండగా.. దీన్ని అదుపు చేసేందుకు 45 కంటే తక్కువ జీఐ ఉన్న వరి రకాన్ని అభివృద్ధి చేశారు అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు. ఆరోగ్యకరమైనదిగా పరిగణించబడే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ లక్షణాలతో కూడిన ఈ బియ్యం డయాబెటిక్, ప్రీడయాబెటిక్ ఉన్నవారికి వరంగా మారనుంది. మధుమేహాన్ని కంట్రోల్ చేయనుంది. కాగా సాధారణ బియ్యం రకాలను తక్కువ జీఐ బియ్యంగా మార్చడం ద్వారా దీన్ని డెవలప్ చేశారు. ఐఆర్ఆర్ఐ ఇప్పటికే ఫిలిప్పీన్స్‌లో ×==× 125, ×==× 147 అనే రెండు తక్కువ-జీఐ వరి రకాలను విడుదల చేసింది. బియ్యం ప్రధానమైన దేశాల్లో పేదరికం, ఆకలిని ఎదుర్కోవడానికి ఐఆర్ఆర్ఐ రెమిట్‌లో భాగంగా భారతదేశం, ఫిలిప్పీన్స్‌లో దీనిని పెంచడం ప్రారంభించాలని యోచిస్తున్నట్లు చెప్పారు శాస్త్రవేత్తలు. ఆసియా,



ఆఫ్రికా ఖండాలలో బియ్యం తినే దేశాలలో ఈ బియ్యం పెద్ద ప్రభావాన్ని చూపుతుందని అభిప్రాయపడ్డారు.

### ప్యూరిఫైడ్ వాటర్ తాగుతున్నారా



ఒకప్పుడు తాగునీరు కావాలంటే ఏం చేసేవారు దగ్గరలో ఉన్న చెరువులు, బావుల్లో నుంచి తెచ్చుకుని మరీ తాగేవారు. లేదంటే ట్యాప్ వాటర్ తాగడం చేసేవారు. కానీ ఇప్పుడు అలా చేస్తున్నారా అంటే..దాదాపుగా ఎవరూ చేయట్లేదు అని చెప్పాలి. ఒకప్పుడు సంపన్నులు మాత్రమే కేవలం ప్యూరిఫైయడ్ వాటర్ అంటూ కాస్త డబ్బులు ఖర్చు చేసి మరియు నీళ్లు శుద్ధి చేసిన నీళ్లను తాగే వాళ్ళు. కానీ ఇప్పుడు పేద మధ్యతరగతి ప్రజలు సైతం ఇలాంటి ప్యూరిఫైడ్ వాటర్ తాగుతూ ఉండడం చూస్తూ ఉన్నాం. ఇక ఏ ఊర్లో చూసిన వాటర్ ప్లాంట్ దర్శనమిస్తుంది. దీంతో బావులు చెరువుల్లో నుంచి నీళ్లు తెచ్చుకుని తాగే అలవాటు ఎప్పుడో కనుమరుగు అయిపోయింది. ఇక ఇప్పుడు ట్యాప్ వాటర్ తాగే వారి సంఖ్య కూడా ఎక్కడా కనిపించడం లేదు. చాలామంది ఎలాంటి శ్రమ లేకుండా ఉండేందుకు ఇంట్లో వాటర్ ప్యూరిఫైయర్లు తెచ్చుకొని వాడుకుంటూ ఉండటం చూస్తూ ఉన్నాం. దీంతో మంచినీటి కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. వాటర్ ప్యూరిఫైయర్ ద్వారా శుద్ధి చేసిన నీటిని పొందగలుగుతున్నాం అని అందరూ అనుకుంటున్నారు. కానీ ప్యూరిఫైడ్ వాటర్ తాగితే మాత్రం ఎన్నో ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్టే అని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ కారణంగా మెగ్నీషియం లోపం ఏర్పడుతుంది అంటూ చెబుతున్నారు నిపుణులు. ఇక ఈ లోపం వల్ల మనిషిలోని నరాల వ్యవస్థ పనితీరుపై ప్రభావం చూపుతోందట. అంతేకాకుండా డయాబెటిస్ ఇస్కిమిక్ స్ట్రోక్ లాంటివి వస్తాయట. ప్రకృతి సిద్ధంగా లభించే నీటిలో పది నుంచి 20% మేరా మెగ్నీషియం ఉంటుందట. కానీ నేటి రోజుల్లో వాడుతున్న ప్యూరిఫైడ్ లేదా మినరల్ వాటర్ లో మాత్రం అన్ని మినరల్స్ ను తొలగిస్తున్నారని ఇటీవల ఇజ్రాయిల్ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. దీంతో నీటి ద్వారా ఒక మనిషికి లభించాల్సిన మెగ్నీషియం లభించడం లేదని.. అందుకే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. అయితే ప్యూరిఫైడ్ వాటర్ మృత జలాలతో సమానం అంటూ చెబుతున్నారు నిపుణులు.

## ఆ టాబ్లెట్స్ వేసుకుంటే కిడ్నీలో రాళ్లు?



విటమిన్ సి మనిషి ఆరోగ్యానికి ఎంత అవసరమో మీకు తెలిసే ఉంటుంది. విటమిన్ సి మృదులాస్థి, ఎముక, డెంటిన్ ల మాత్రికను, రక్తనాళాల ఎండోథీలియమ్ ను చాలా ఆరోగ్యంగా ఉంచడమే కాక, రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది.అందుకే డాక్టర్స్ విటమిన్ సి గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఉంటారు. అది మాత్రమే కాకుండా రక్తంలో కొలెస్టరాల్ ను కరిగించడానికి, గాయాలు త్వరగా మానడానికి, ఇనుము శోషణాన్ని అధికం చేయడానికి కూడా విటమిన్ సి అనేది దోహద పడుతుంది. ఇంకా విటమిన్ సి రక్తపోటును తగ్గిచటం, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచటంలో పాత్ర పోషిస్తుంది కాబట్టి.. దీని మోతాదు తగ్గితే అది మంచిది కాదని కూడా చెబుతూ ఉంటారు. అయితే దీనిని కొంతమంది నేరుగా సంప్లిమెంట్లు రూపంలో తీసుకుంటూ ఉంటారు. కానీ అది అంత మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలా డైరెక్టుగా విటమిన్ సి సప్లిమెంట్స్ తీసుకుంటే, కిడ్నీలో కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ వైద్యుడు అయినటువంటి విజయ్ కిరణ్ తాజాగా వెల్లడించారు. దీనిని సప్లిమెంట్ రూపంలో కంటే కూడా ఆహారం రూపంలోనే తీసుకుంటే ఉత్తమం అని చెబుతున్నారు. విటమిన్ సి ఎక్కువగా నిమ్మ, నారింజ జాతి ఫలాలు, ఉసిరి, ఆకుకూరలు, తాజా బంగాళాదుంప, టమాటో మొదలైన వాటిలో ఎక్కువగా లభిస్తుంది. ఇది సప్లిమెంట్ల రూపంలో కూడా మెడికల్ షాపుల్లో లభ్యమవుతుంది. అయితే మాత్రలను వేసుకోవటం కన్నా ఆహారం ద్వారానే విటమిన్ సి లభించేలా చూసుకోవటం మేలని ఆరోగ్య నిపుణుల మాట. విటమిన్ సి లోపమనేది ఒక రకంగా అనారోగ్యకర జీవనశైలికి నిదర్శనమని, ఇది పక్షవాతం ముప్పును కూడా పెంచే అవకాశం ఉందని గుర్తు చేస్తున్నారు. మద్యపానం, అధిక బరువు, అధిక రక్తపోటు వంటివన్నీ కూడా పక్షవాతం ముప్పును పెంచేవే. మన జీవనశైలిని మార్చుకోవటం ద్వారా వీటిని దూరంగా ఉంచుకోవచ్చు. అందువల్ల ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండటం అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110